


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శనివారం 20-12-2025 | సంపుటి - 26 | సంచిక -212 | రూ : 4 | పేజీలు: 8





2లో

## ఉద్యోగ అభ్యర్థుల నిజాయితీకి
# అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

- హైదరాబాద్‌లో పీఎస్‌సీ చైర్మన్ల జాతీయ సదస్సును ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము
- నైపుణ్యం లేకపోయినా శిక్షణతో మెరుగుపరచవచ్చు, నిజాయతీ లోపిస్తే కష్టమని వ్యాఖ్యలు
- అణగారిన వర్గాలకు సేవ చేయాలనే దృక్పథం అభ్యర్థుల్లో ఉండాలని సూచన

## ఢిల్లీని కమ్మేసిన
# దట్టమైన పొగమంచు..
## 152 విమానాల రద్దు

- శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి
- హెచ్‌డీ హబ్ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ లింకుల అమ్మకం
- ఒక్కో లింక్‌కు 300 డాలర్ల వరకు వసూలు



2లో



2లో

ఏపీ అభివృద్ధికి
## చేయూతనివ్వండి..

- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సీఎం చంద్రబాబు భేటీ
- రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మార్చేందుకు నిధులు కోరిన సీఎం
- పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు ఆర్థిక సహకారం అందించాలని విజ్ఞప్తి

## ఆస్ట్రేలియాలో కాల్పులతో
# హైదరాబాద్‌కు సంబంధం లేదు

- బోండీ బీచ్‌లో కాల్పులు జరిగిన సాజిద్ అక్రమ్
- సాజిద్ అక్రమ్ హైదరాబాదీయే కానీ ఉగ్ర ఘటనతో నగరానికి సంబంధం లేదన్న శివధర్ రెడ్డి
- 1998లో ఉన్నతవిద్యాభ్యాసం కోసం వెళ్లి అక్కడే స్థిరపడినట్లు వెల్లడి




2లో



2లో

బంగ్లాదేశ్ లో అదుపు తప్పుతున్న
## పరిస్థితులు..

తమ పౌరులకు అలర్ట్ జారీ చేసిన అమెరికా


- ఇంక్విలాబ్ మంచ్ నేత హాదీ మృతితో బంగ్లాదేశ్‌లో హింస
- భారత వ్యతిరేకిగా ముద్రపడ్డ హాదీ
- తమ పౌరులు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన అమెరికా
- బ్రిటన్ కూడా ట్రావెల్ అడ్వైజరీ జారీ

# అమరావతి కనెక్టివిటీయే లక్ష్యం..
## కేంద్ర మంత్రి గడ్కరీతో సీఎం భేటీ

- ఢిల్లీలో కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ
- అమరావతికి జాతీయ రహదారుల అనుసంధానంపై ప్రధానంగా చర్చ
- కృష్ణా నదిపై ఆరు లేన్ల ఐకానిక్ వంతెన నిర్మించాలని విజ్ఞప్తి
- హైదరాబాద్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ హైవే ప్రతిపాదన

2లో





## హైదరాబాద్ ఓల్డ్ సిటీలో
# రూ.400 కోట్ల విలువైన భూమిని
## కాపాడిన హైడ్రా

- పాతబస్తీలో 7 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం
- భూమి విలువ రూ.400 కోట్లు ఉంటుందని అంచనా
- దశాబ్దాలుగా కబ్జాలో ఉంచిన వారిని ఖాళీ చేయించిన అధికారులు
- హైడ్రా చర్యలపై స్థానిక ప్రజల హర్షం
- చెరువు, నాలాలను కూడా పునరుద్ధరించాలని విజ్ఞప్తి

2లో

# బంగ్లాదేశ్ లో అదుపు తప్పుతున్న పరిస్థితులు... తమ పౌరులకు అలర్ట్ జారీ చేసిన అమెరికా

బంగ్లాదేశ్, డిసెంబర్ 19: పొరుగు దేశం బంగ్లాదేశ్‌లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రాడికల్ సంస్థ ఇంక్విలాబ్ మంచ్ ప్రతినిధి షరీఫ్ ఉస్మాన్ హాదీ మృతితో దేశవ్యాప్తంగా హింస చెలరేగింది. ఈ నేపథ్యంలో అమెరికా, బ్రిటన్ తమ దేశ పౌరులకు కీలక హెచ్చరికలు జారీ చేశాయి. అప్రమత్తంగా ఉండాలని, పెద్ద సభలు, ప్రదర్శనలకు దూరంగా ఉండాలని సూచించాయి. తీవ్ర గాయాలతో సింగపూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న హాదీ, ఆరు రోజుల పాటు మృత్యువుతో పోరాడి శుక్రవారం కన్నుమూశాడు. ఈ విషయాన్ని బంగ్లా తాత్కాలిక ప్రభుత్వ ప్రధాన సలహాదారు మహమ్మద్ యూనస్ గురువారం రాత్రి అధికారికంగా ధృవీకరించారు. హాదీ మృతదేహం శుక్రవారం సాయంత్రం ఢాకాకు చేరుకోనుందని, శనివారం జాతీయ పార్లమెంట్ భవనం ముందు అంత్యక్రియల ప్రార్థనలు జరిగే అవకాశం ఉందని ఢాకాలోని అమెరికా రాయబార కార్యాలయం తెలిపింది. ఈ కారణంగా దేశవ్యాప్తంగా భారీ నిరసనలు, ప్రదర్శనలు జరిగే ప్రమాదం ఉందని పేర్కొంది. శాంతియుతంగా తలపెట్టిన కార్యక్రమాలు కూడా హింసాత్మకంగా మారవచ్చని, కాబట్టి అమెరికా పౌరులు అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరింది. బ్రిటన్ విదేశాంగ కార్యాలయం కూడా తమ పౌరులకు ట్రావెల్ అడ్వైజరీ జారీ చేసింది. ముఖ్యంగా హింసాత్మక ఘటనలు ఎక్కువగా నమోదవుతున్న చిట్టగాంగ్ కొండ ప్రాంతాలకు వెళ్లవద్దని స్పష్టం చేసింది. అటు, హాదీ మృతికి సంతాపంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం శనివారం (డిసెంబర్ 20) జాతీయ సంతాప దినంగా ప్రకటించింది. యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బంగ్లాదేశ్‌లో శాంతిభద్రతలు క్షీణించాయని నివేదికలు వస్తున్నాయి.

## ఆస్ట్రేలియాలో కాల్పులతో
# హైదరాబాద్‌కు సంబంధం లేదు: డీజీపీ

హైదరాబాద్: ఆస్ట్రేలియాలోని బోండీ బీచ్‌లో కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినప్పటికీ, ఆ ఉగ్ర ఘటనతో హైదరాబాద్‌కు సంబంధం లేదని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆస్ట్రేలియాలో యూదులపై కాల్పులు జరిపిన వారిలో సాజిద్ అక్రమ్‌కు హైదరాబాద్ మూలాలు ఉన్నట్లు బయటపడింది. పాతబస్తీకి చెందిన అతడు 1998లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ఆస్ట్రేలియా వెళ్లి, అక్కడే యూరోపియన్ మూలాలున్న వెనెరా గ్రాసో అనే మహిళను వివాహం చేసుకొని స్థిరపడ్డాడు. సాజిద్‌కు హైదరాబాద్ మూలాలు ఉండటంతో, ఈ కాల్పుల ఘటనపై డీజీపీ మరోసారి స్పందించారు. 1998లో ఉపాధి కోసం ఆస్ట్రేలియా వెళ్లిన సాజిద్ అక్రమ్ ఆరుసార్లు భారత్ వచ్చాడని, ఆస్ట్రేలియాలోనే యూరోపియన్ యువతిని వివాహం చేసుకున్న తర్వాత 1998లో భార్యతో పాటు ఒకసారి హైదరాబాద్‌కు వచ్చాడని వెల్లడించారు. 2004, 2009, 2011, 2016లో ఆయన వచ్చాడని అన్నారు. 2016లో ప్రాపర్టీ సెటిల్‌మెంట్ కోసం వచ్చాడని, 2022లో చివరిసారి తల్లి, సోదరిని చూడటం కోసం వచ్చాడని తెలిపారు. కాగా, బోండీ బీచ్‌లో జరిగిన ఉగ్రదాడిలో 16మంది మృతి చెందారు.

## హైదరాబాద్ ఓల్డ్ సిటీలో
# రూ.400 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

హైదరాబాద్: హైదరాబాద్ పాతబస్తీలో దశాబ్దాలుగా కబ్జాలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమికి విముక్తి లభించింది. సుమారు రూ.400 కోట్ల విలువైన 7 ఎకరాల స్థలాన్ని హైదరాబాద్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ అండ్ రీసెర్చ్ అథారిటీ (హైడ్రా) శుక్రవారం స్వాధీనం చేసుకుంది. కోర్టు కేసులు, పోలీసు ఫిర్యాదులను సైతం లెక్కచేయకుండా ఆక్రమణదారులు ఏర్పాటు చేసిన ఇనుప రేకుల ప్రహరీని తొలగించి, ఆ స్థలం ప్రభుత్వానిదని బోర్డులు ఏర్పాటు చేశారు. బండ్లగూడ మండలం, కందికల్ గ్రామంలోని మహమ్మద్‌నగర్‌లలితాబాగ్ ప్రాంతంలో సర్వే నంబర్ 28లో మొత్తం 9.11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే 2 ఎకరాలు కబ్జాకు గురై నివాసాలు వెలిశాయి. మిగిలిన 7 ఎకరాలను ఆర్. వెంకటేష్ కుటుంబ సభ్యులు, వారి నుంచి కొనుగోలు చేశానని చెబుతున్న పట్టాభి రామిరెడ్డి తమ ఆధీనంలో ఉంచుకున్నారు. సర్వే ఆఫ్ ఇండియా మ్యాపుల ప్రకారం ఇక్కడ ఒక చెరువు ఉండేదని, దానిని కబ్జాదారులు మట్టితో పూడ్చివేశారని అధికారులు గుర్తించారు. ఈ ఆక్రమణలపై గతంలో రెవెన్యూ అధికారులు భవానీ నగర్ పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ భూమిని తమదని వాదిస్తూ కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు ఆక్రమణదారులకు న్యాయస్థానం కోటి రూపాయల జరిమానా కూడా విధించింది. అయినప్పటికీ వారు భూమిని ఖాళీ చేయలేదు. తాజాగా హైడ్రా అధికారులు పోలీసు బందోబస్తు మధ్య కబ్జాదారుల చెర నుంచి భూమిని విడిపించారు. ఈ చర్యపై స్థానికులు, కుమ్మరివాడి పీస్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఇక్కడి చెరువు, నాలాలను

## ఢిల్లీని కమ్మేసిన దట్టమైన పొగమంచు..
# 152 విమానాలు రద్దు

ఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీని శుక్రవారం దట్టమైన పొగమంచు కమ్మేసింది. దీని కారణంగా దృశ్య స్పష్టత తీవ్రంగా పడిపోవడంతో విమాన రాకపోకలపై తీవ్ర ప్రభావం పడింది. ఢిల్లీ విమానాశ్రయంలో ఒకే రోజు 152 విమానాలను రద్దు చేసినట్లు అధికారులు ప్రకటించారు. రద్దయిన వాటిలో 79 ఇతర గమ్యస్థానాలకు వెళ్లేవి ఉంటే, 73 నగరానికి వచ్చేవి ఉన్నాయి. ప్రస్తుతం ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ 'క్యాట్ III' నిబంధనల కింద పనిచేస్తోంది. దీంతో అనేక విమానాలు ఆలస్యంగా నడుస్తున్నాయి. ప్రయాణికులు తమ విమాన సర్వీసుల సమాచారం కోసం సంబంధిత ఎయిర్‌లైన్స్‌ను సంప్రదించాలని ఎయిర్‌పోర్ట్ అధికారులు ఎక్స్ (ట్విట్టర్) ద్వారా సూచించారు. ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి పలు విమానయాన సంస్థలు కూడా వాతావరణం కారణంగా సర్వీసులకు అంతరాయం కలగొచ్చని ప్రయాణికులకు హెచ్చరికలు జారీ చేశాయి. పొగమంచుతో పాటు వాయు కాలుష్యం కూడా ఢిల్లీని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. గాలి నాణ్యత సూచీ 380కి పడిపోయింది. ఢిల్లీఎన్‌సీఆర్ పరిధిలోని నోయిడా, ఘజియాబాద్‌లలో దృశ్య స్పష్టత 100 మీటర్ల కంటే తక్కువగా నమోదైంది. దీంతో భారత వాతావరణ శాఖ నగరానికి ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఇదే తరహా పరిస్థితి ఉత్తరప్రదేశ్‌లోనూ నెలకొంది. అక్కడ కూడా రానున్న రెండు రోజులకు పొగమంచు హెచ్చరికలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు వాహనాల వేగాన్ని నియంత్రించాలని సీఎం యోగి ఆదిత్యనాథ్ అధికారులను ఆదేశించారు. రేపు కాస్త ఉపశమనం లభించినా, ఆది, సోమవారాల్లో

# ఉద్యోగ అభ్యర్థుల నిజాయితీకి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల కోసం అభ్యర్థులను ఎంపిక చేసేటప్పుడు వారి నిజాయతీ, సమగ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఉద్బోధించారు. ఈ రెండు లక్షణాలు అత్యంత కీలకమని, వీటి విషయంలో ఎలాంటి రాజీకి తావులేదని ఆమె స్పష్టం చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో ప్రారంభమైన రాష్ట్రాల పబ్లిక్ సర్వీస్ కమిషన్ల (పీఎస్‌సీ) చైర్‌పర్సన్‌ల జాతీయ సదస్సును ఆమె ప్రారంభించి కీలక ప్రసంగం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, "అభ్యర్థులలో నైపుణ్యాలు లేదా సామర్థ్యాలు తక్కువగా ఉంటే, వాటిని శిక్షణ కార్యక్రమాలు, ఇతర వ్యూహాల ద్వారా మెరుగుపరచవచ్చు. కానీ, సమగ్రత, నిజాయతీ లోపిస్తే మాత్రం పరిపాలనలో అధిగమించలేని పెను సవాళ్లు ఎదురవుతాయి. అందుకే నియామక ప్రక్రియలో చిత్తశుద్ధికి కమిషన్లు పెద్దపీట వేయాలి" అని అన్నారు. ప్రభుత్వ సేవకులుగా బాధ్యతలు చేపట్టాలనుకునే యువతకు సమాజంలోని అట్టడుగు వర్గాలు, బలహీన వర్గాల కోసం పనిచేయాలనే తపన ఉండాలని ఆమె ఆకాంక్షించారు.

**మహిళల పట్ల సున్నితత్వం అవసరం**

ప్రభుత్వ పాలనలో మహిళల అవసరాలు, ఆకాంక్షల పట్ల సివిల్ సర్వెంట్లు మరింత సున్నితంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని రాష్ట్రపతి నొక్కి చెప్పారు. "పబ్లిక్ సర్వీస్ కమిషన్లు అభ్యర్థులలో జెండర్ సెన్సిటైజేషన్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి. అప్పుడే ప్రభుత్వ పథకాలు, సేవలు మహిళలకు మరింత సమర్థవంతంగా చేరతాయి" అని ఆమె వివరించారు. నిష్పాక్షికత, కొనసాగింపు, స్థిరత్వం వంటి కీలక లక్షణాలను ప్రభుత్వ పాలనకు అందించేది 'శాశ్వత కార్యనిర్వాహక వర్గం' అని, ఈ వర్గాన్ని ఎంపిక చేసే బాధ్యత పీఎస్‌సీలదేనని ఆమె గుర్తుచేశారు. జాతీయ, రాష్ట్ర స్థాయిలలో ప్రజోపయోగ విధానాలు సక్రమంగా అమలు కావాలంటే ఈ అధికారుల సమగ్రత, సున్నితత్వం, సామర్థ్యం చాలా ముఖ్యమని తెలిపారు.

*** 'వికసిత భారత్' లక్ష్య సాధనలో కీలక పాత్ర**

మారుతున్న సాంకేతిక సవాళ్లను ముందుగానే ఊహించి, నియామక ప్రక్రియలో పారదర్శకత, విశ్వసనీయతను బలోపేతం చేయడంపై కమిషన్లు దృష్టిసారించాలని రాష్ట్రపతి సూచించారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా, విభిన్న సంస్కృతులకు నిలయంగా ఉన్న భారతదేశానికి అన్ని స్థాయిలలో సమర్థవంతమైన పరిపాలన వ్యవస్థలు అవసరమని ఆమె పేర్కొన్నారు. "త్వరలోనే ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించాలని దేశం లక్ష్యంగా పెట్టుకుంది. అలాగే, 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా మనం పయనిస్తున్నాం. ఈ లక్ష్యాల సాధనలో పీఎస్‌సీలు ఎంపిక చేసే అధికారుల పాత్ర అత్యంత కీలకం" అని అన్నారు. ఈ సదస్సులో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, యూజీసీ చైర్మన్ వినీర్ జోషి తదితరులు పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శీతాకాల విడిది నిమిత్తం

# మంగళగిరితో పోటీ...

అభివృద్ధిలో, పార్టీ బలోపేతం చేసే విషయంలో మంగళగిరి నియోజకవర్గంతో పోటీ పడతామంటూ రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు చేసిన సవాల్‌ను తాను మనస్ఫూర్తిగా స్వీకరిస్తున్నట్లు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రకటించారు. ప్రేమతో ప్రజల మనసులను గెలుచుకుంటూ, వారితో మమేకమై ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. రాజమండ్రిలోని చెరుకూరి వీర్రాజు సుబ్బలక్ష్మి కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరిగిన రాజమండ్రి పట్టణ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో లోకేశ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కష్టకాలంలో తమ కుటుంబానికి అండగా నిలిచిన ఆదిరెడ్డి కుటుంబాన్ని జీవితంలో మర్చిపోలేనని భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. "చంద్రబాబు గారిని 53 రోజుల పాటు అక్రమంగా ఇదే రాజమండ్రి జైలులో బంధించినప్పుడు ఆదిరెడ్డి కుటుంబం మాకు అండగా నిలిచింది. శాసనసభలో నా తల్లిని అవమానించినట్లే, ఆదిరెడ్డి భవానీ గారిని కూడా అవమానించారు. ఎన్నో ఇబ్బందులు పెట్టినా, జై తెలుగుదేశం నినాదానికే ఆ కుటుంబం కట్టుబడింది. నాడు, నేడు, ఎప్పుడూ టీడీపీ కూడా ఆదిరెడ్డి కుటుంబానికి అండగా నిలుస్తుంది" అని లోకేశ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసును తన కుటుంబ సభ్యుడిలా భావిస్తానని ఆయన స్పష్టం చేశారు.

*** కూటమి ప్రభుత్వం ప్రతి హామీని నిలబెట్టుకుంది**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుందని లోకేష్ తెలిపారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, వృద్ధులకు రూ.4 వేలు, వికలాంగులకు రూ.6 వేలు, తీవ్ర అనారోగ్యంతో మంచానికే పరిమితమైన వారికి రూ.15 వేల పింఛను అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అని గుర్తుచేశారు. తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికీ ఆర్థిక సాయం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల వంటి హామీలను అమలు చేస్తున్నామని వివరించారు. 150 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తి చేసి 16వేల ఉపాధ్యాయ పోస్టులు, 6 వేల కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని చెప్పారు. "ఏపీకి బ్రాండ్ చంద్రబాబు నాయుడు గారే. ఆయన నాయకత్వం వల్లే రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయి," అని అన్నారు.

*** 'వైనాట్ 175' అన్నారు... ఇప్పుడు 'టీమ్ 11'కే పరిమితం అయ్యారు!**

రాష్ట్రంలో ఓ సైకో ఇంకా అరెస్టులు చేస్తానని బెదిరిస్తున్నాడని, అలాంటి బెదిరింపులకు భయపడేది లేదని లోకేశ్ పరోక్షంగా జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. "53 రోజులు మా నాయకుడిని జైల్లో పెట్టి ఏం సాధించారు? మీ కంటే ముందు చాలా మంది పెద్ద మాటలు మాట్లాడారు, వారి పరిస్థితి ఏమైందో గుర్తుంచుకోవాలి. చట్టాన్ని ఉల్లంఘించిన వారిని కూటమి ప్రభుత్వం వదిలిపెట్టదు" అని హెచ్చరించారు. 'వైనాట్ 175' అన్నవారు ఇప్పుడు 'టీమ్ 11'కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు.

*** కూటమి మధ్య నో విడాకులు!**

తెలుగుజాతి ఉన్నంత వరకు టీడీపీ ఉంటుందని, పార్టీని ఎవరూ ఏమీ చేయలేరని అన్నారు. కుప్పం, హిందూపురంలాగే రాజమండ్రిని కూడా టీడీపీకి కంచుకోటగా మార్చాలని, చరిత్ర సృష్టించాలన్నా, తిరగరాయాలన్నా అది టీడీపీతోనే సాధ్యమని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కూటమి పార్టీల మధ్య చిచ్చుపెట్టే కుట్రలు జరుగుతాయని, వాటి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "కూటమి మధ్య నో క్రాస్ ఫైర్, నో మిస్ ఫైర్, నో విడాకులు. వచ్చే 15 ఏళ్ల పాటు కూటమి ప్రభుత్వమే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంది" అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.

## ఏపీ అభివృద్ధికి చేయూతనివ్వండి..
# కేంద్ర మంత్రి నిర్మలతో సీఎం చంద్రబాబు



అమరావతి: ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు ఇవాళ ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సమావేశమయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు రాబోయే కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి, అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ మేరకు ఆయన పలు విజ్ఞాపన పత్రాలను కేంద్ర మంత్రికి అందజేశారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు రానున్న మూడేళ్లలో రూ.41 వేల కోట్ల ఆర్థిక సహాయం అవసరమని, దీని కోసం వచ్చే బడ్జెట్‌లో ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలని చంద్రబాబు కోరారు. అలాగే కరవు పీడిత ప్రాంతాలైన రాయలసీమ, ప్రకాశం, నెల్లూరు జిల్లాల సాగు, తాగునీటి అవసరాలు తీర్చేందుకు గోదావరి వరద జలాలను తరలించే పోలవరం నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఆర్థిక చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు.

**'సాస్కి'తో ఏపీకి చేయూత**

'పూర్వోదయ', 'సాస్కి' పథకాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు అండగా నిలవాలని సీఎం కోరారు. పూర్వోదయ పథకం కింద గ్రామీణ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధికి సహకరించాలని కోరారు. సాస్కి పథకం కింద పెండింగ్‌లో ఉన్న యూనిటీ మాల్, గండికోట పర్యాటక ప్రాజెక్టులతో పాటు, కొత్త మౌలిక సదుపాయాల కల్పన కోసం 202526 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.10,054కోట్లు మంజూరు చేయాలని వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రం ఎదుర్కొంటున్న ఆర్థిక సవాళ్లను దృష్టిలో ఉంచుకుని ఈ కీలక

## అమరావతి కనెక్టివిటీయే లక్ష్యం...
# కేంద్ర మంత్రి గడ్కరీతో సీఎం చంద్రబాబు భేటీ

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి అత్యుత్తమ రహదారి కనెక్టివిటీని కల్పించడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీతో సమావేశమయ్యారు. రాజధాని నగరాన్ని దేశంలోని ప్రధాన నగరాలతో అనుసంధానించే కీలకమైన జాతీయ రహదారుల ప్రాజెక్టులకు సహకారం అందించాలని కోరారు. ఈ సందర్భంగా దేశంలో జాతీయ రహదారుల నెట్వర్క్ ను బలోపేతం చేయడంలో గడ్కరీ చేస్తున్న కృషిని చంద్రబాబు ప్రశంసించారు. ఈ సమావేశంలో అమరావతి అభివృద్ధికి అత్యంత కీలకమైన రెండు ప్రధాన ప్రాజెక్టులను చంద్రబాబు ప్రస్తావించారు. కృష్ణా నదిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఆరు లేన్ల ఐకానిక్ కేబుల్ స్టెడ్ వంతెన నిర్మాణ బాధ్యతను జాతీయ రహదారుల సంస్థ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. మూలపాడు వద్ద నిర్మించ తలపెట్టిన ఈ వంతెన, అమరావతిని మూడు కీలక జాతీయ రహదారులతో అనుసంధానిస్తుందని వివరించారు. విజయవాడ హైదరాబాద్, చెన్నైకోల్‌కతా జాతీయ రహదారులతో పాటు తీరప్రాంత రోడ్ కారిడార్‌తో ఈ వంతెన రాజధానికి వారధిగా నిలుస్తుందని తెలిపారు. ఒక ప్రధాన నదిపై నిర్మించే ఈ ఐకానిక్ వంతెన రాష్ట్ర రాజధానికి అత్యంత ముఖ్యమైన ప్రాజెక్టు అని, దీని నిర్మాణాన్ని కేంద్రమే చేపట్టాలని కోరారు. అలాగే, హైదరాబాద్ నుంచి అమరావతి వరకు ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ హైవే గురించి కూడా చంద్రబాబు చర్చించారు. ఈ హైవే నిర్మాణం పూర్తయితే రెండు నగరాల మధ్య హైస్పీడ్ యాక్సెస్ ఏర్పడుతుందని, తద్వారా ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు కేవలం కనెక్టివిటీని మెరుగుపరచడమే కాకుండా, అమరావతిని జాతీయ రహదారి గ్రిడ్‌లో ఒక ప్రధాన మొబిలిటీ కేంద్రంగా, లాజిస్టిక్స్ నోడ్‌గా మారుస్తాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. గ్రీన్ ఫీల్డ్ నగరంగా అభివృద్ధి చెందుతున్న అమరావతికి ప్రత్యక్ష, పరోక్ష నెట్వర్క్ ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకతను ఆయన గడ్కరీకి వివరించారు. ఈ ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

# ప్రజలను మెప్పించే విధంగా పాలన సాగాలి

* **నిస్వార్థ, పారదర్శక సేవలే లక్ష్యం**
* **సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం:గ్రామ పంచాయితీ ఎన్నికల్లో సిపిఐ అజేయ శక్తిగా నిలిచిందని, గెలిచిన సిపిఐ సర్పంచులు, వార్డు సభ్యులు నిస్వార్థంగా, పారదర్శకంగా ప్రజారంజక పాలన అందించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు.శుక్రవారం కొత్తగూడెం క్లబ్‌లో నిర్వహించిన గెలుపొందిన సర్పంచులు, వార్డు సభ్యుల అభినందన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే తమ ప్రథమ ఎజెండా కావాలని సూచించారు. జిల్లావ్యాప్తంగా సిపిఐ ఒంటరి పోరులో 47 సర్పంచ్ స్థానాలు, 57 ఉపసర్పంచ్ పదవులు, 432 వార్డులను గెలుచుకుని ఎర్రజెండా ఎగరవేసిందన్నారు. మేజర్ గ్రామ పంచాయితీల్లోనూ సిపిఐ విజయాలు సాధించిందని తెలిపారు.కొత్తగూడెం నియోజకవర్గంలో కాంగ్రెస్ కంటే సిపిఐకే అధిక ఓట్లు పోలయ్యాయని, పొత్తు చెడటానికి స్థానిక నాయకుల తీరే కారణమని పేర్కొన్నారు. రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ ఎన్నికల్లోనూ సిపిఐదే పై చేయి అవుతుందని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ గెలిచిన అభ్యర్థులు ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని సూచించారు. అనంతరం గెలుపొందిన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించారు.

# క్రిస్మస్ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలి

* **అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్**



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : లోక రక్షకుడు.. కరుణామయుడు.. ఏసుక్రీస్తు పుట్టిన పవిత్రమైన రోజున జరుపుకునే క్రిస్మస్ పండుగ అందరూ ఆనందంగా జరుపుకోవాలని అల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ అన్నారు. ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని అల్విన్ కాలనీ ఫేస్ 1 సాయి కల్యాణ మండపంలో యునైటెడ్ క్రిస్టియన్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో, ఎల్లమ్మబండ ఎన్.టి.ఆర్ నగర్ లోని బేతల్ గాస్పల్ చర్చ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రాండ్ క్రిస్మస్ వేడుకలకు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై పాస్టర్లు , స్థానిక నాయకులతో కలిసి కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరీ సోదరీమణులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ లోని ప్రజలందరూ కుల మతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసిమెలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయం అని అన్నారు. డివిజన్ ప్రజలందరికి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయుకులు, చర్చ్ పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు, తదితరులు పాల్గొన్నారు.

# రెండేళ్లలోనే తెలంగాణ రాష్ట్రానికి కొత్త దిశ

* **మారుతున్న కాలానికి అనుగుణంగా పనితీరు మారాలి**
* **డీపీఆర్వోల వర్క్ షాపులో**
* **మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



హైదరాబాద్, (ప్రజాస్ఫూర్తి) : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం, రెండేళ్ల పాలనలోనే తెలంగాణకు స్పష్టమైన కొత్త దిశను చూపించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు ఏ మార్పు కోరుకొని కాంగ్రెస్ పార్టీపై విశ్వాసం ఉంచారో, ఆ మార్పును కేవలం రెండేళ్లలోనే ప్రజల కళ్ల ముందే నిలబెట్టామని తెలిపారు. ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని ప్రజా ప్రభుత్వం నిలబెట్టుకుందని స్పష్టం చేశారు. తెలంగాణ సమాచార పౌర సంబంధాల శాఖ, మీడియా అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లిలోని మీడియా అకాడమీలో జిల్లా ప్రజా సంబంధాల అధికారులతో శుక్రవారం నిర్వహించిన పునశ్చరణ తరగతులకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "మేం అధికారం చేపట్టినప్పుడు తెలంగాణ అన్ని రంగాల్లో తీవ్రమైన సంక్షోభంలో ఉందన్నారు. ఒక్కో మెట్టు ఎక్కుతూ ఆ సంక్షోభం నుంచి బయటపడి, అభివృద్ధి-సంక్షేమాలను పరుగులు పెట్టిస్తున్నాం" అని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేదవాడికి అండగా నిలిచామని తెలిపారు. వ్యవసాయం, విద్య, వైద్యం, గృహ నిర్మాణం, సన్నబియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఉపాధి కల్పన వంటి ప్రతి రంగంలో ప్రజా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలు తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలబెడుతున్నాయని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి కార్యక్రమాలు ఆశించిన స్థాయిలో ప్రజల్లోకి చేరడం లేదని అన్నారు. ప్రజలకూ ప్రభుత్వానికీ వారధిగా ఉండాల్సిన ప్రజా సంబంధాల అధికారుల పాత్ర మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని సూచించారు. ప్రస్తుత మీడియా మార్పులకు అనుగుణంగా ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా సమన్వయంతో ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వేగంగా విస్తరిస్తున్న సోషల్ మీడియాను ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రచారానికి శక్తివంతమైన సాధనంగా వినియోగించాలని అన్నారు. క్షేత్రస్థాయికి వెళ్లి విజయవంతంగా అమలవుతున్న ప్రభుత్వ పథకాలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటిని ప్రజలకు చేరేలా సృజనాత్మక ప్రచారం చేయాలని ఆదేశించారు. ప్రతి జిల్లాకు సమర్థవంతమైన డీపీఆర్‌వోల ను నియమించా లని, ఇతర విభాగాలలో ఉన్నవారి డిప్యూటేషన్‌లను రద్దు చేయాలని, అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని, ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సమాచార శాఖ కమిషనర్‌ను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డి,ఐడిసీ చైర్మన్ మువ్వ విజయబాబు, ఐ&పీఆర్ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక, సీఎం సీపీఆర్వో జి. మల్సూర్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎన్ ఏపీఎస్ ఒలింపియాడ్స్‌లో పాల్వంచ నారాయణ విద్యార్థుల జైత్రయాత్ర













ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: భారతదేశ వ్యాప్తంగా నిర్వహించిన సీఎన్ ఏపీఎస్ -2025-26 ఒలింపియాడ్ పరీక్షల్లో పాల్వంచ నారాయణ పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చూపి జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు నిర్వహించిన 'ఓ' సిరీస్లో భాగంగా జరిగిన రీజనల్ ఒలింపియాడ్ ఇన్ మ్యాథమేటిక్స్ (ఆర్.ఓ.యం)లో స్థానిక నారాయణ స్కూల్ విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు.ఈ పరీక్షల్లో టాప్ 25 ర్యాంకుల్లో మోహిత్ ఠాగూర్ (219097) 19వ ర్యాంకు, టాప్ 50లో జితేందర్ (219187) 40వ ర్యాంకు, టాప్ 100లో సాయి భవిష్య శ్రీ (219180), కుసువర్ణ (219163), మౌలానా (219135) 91వ ర్యాంకు సాధించారు. మొత్తం ఐదుగురు విద్యార్థులు టాప్ 100లో నిలవడం విశేషం. పాల్వంచ నారాయణ బ్రాంచ్ నుంచి మొత్తం 138 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా, వారిలో ఐదుగురు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రిన్సిపాల్ తెలిపారు. 'ఓ' సిరీస్ విభాగంలో గణిత సబ్జెక్టుపై ఈ పరీక్ష నిర్వహించబడిందన్నారు. ఈ ఫలితాలు నారాయణ విద్యాసంస్థల నాణ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి ప్రతి సంవత్సరం సీఎన్ ఏపీఎస్ ఒలింపియాడ్స్ నిర్వహించటం ఎంతో ప్రాముఖ్యత కలిగినదన్నారు. 'ఓ' సిరీస్‌లో 3, 'ఐ' సిరీస్‌లో 5 పరీక్షలు ఉంటాయని తెలిపారు. ఈ విజయాలు సీఎన్ ఏపీఎస్ చరిత్రలో నారాయణకు ఒక సువర్ణ ఘట్టంగా నిలిచాయని నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు తెలిపారు. పోటీ పరీక్షల్లో విజయాల కోసం సీఓ స్పార్క్, ఒలింపియాడ్, ఈటెక్నో, మెడిస్పార్క్ వంటి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అందిస్తున్నామని చెప్పారు.ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, కృషి చేసిన ఉపాధ్యాయులు మరియు అధ్యాపకేతర సిబ్బందిని ఏజీఎం రాంకీ, ప్రిన్సిపాల్ పూరేటి నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు.




# కేపిహెచ్బీ కాలనీని విభజించి మూడు ముక్కలు చేయవద్దు

* **కేపీహెచ్బీ కాలనీ వాసులు**



కూకట్పల్లి, (ప్రజాస్ఫూర్తి) : జిహెచ్‌ఎంసి డివిజన్ల తాజా పునర్విభజనలో భాగంగా ఆసియా ఖండంలోనే అతిపెద్ద కాలనీగా పేరొందిన కేపిహెచ్బీ కాలనీని విభజించి మూడు ముక్కలు చేయవద్దని కేపీహెచ్బీ కాలనీ వాసులు పేర్కొన్నారు. శుక్రవారం కేపీహెచ్బీ కాలనీ మొదటి రోడ్డు గాంధీ బొమ్మ వద్ద కేపీహెచ్బీ కాలనీ వాసులు శాంతియుత నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేపీహెచ్బీ కాలనీ రోడ్డు నెంబర్ ఒకటి నుంచి కల్వరి టెంపుల్ వరకు కేపీహెచ్బీ కాలనీ డివిజన్ అని, బాలాజీ నగర్ డివిజన్ అని, వసంత నగర్ డివిజన్ అని మూడు ముక్కలుగా చేశారన్నారు. 46 సంవత్సరముల క్రితం ఆవిర్భవించిన కేపీహెచ్బీ కాలనీ అస్తిత్వం కోల్పోతుందని అలా కాకుండా కేపీహెచ్బీ కాలనీ రోడ్ నెంబర్ 1 నుంచి జేఎన్టీయూ. రోడ్డు వరకు కేపీహెచ్బీ కాలనీ డివిజన్ 1 గా, జేఎన్టీయూ రోడ్డు నుంచి కల్వరి టెంపుల్ ముందు రోడ్డు వరకు కేపీహెచ్బీ కాలనీ డివిజన్ 2 గా చేయాలని కాలనీవాసులందరూ ముక్తకంఠంతో కోరారు. అనంతరం కూకట్ పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే కంటెస్టెంట్ అభ్యర్థి ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ పాల్గొని సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కట్టా నరసింగరావు, కొల్లా శంకర్, షేక్ సత్తార్, జేఎస్. నారాయణరావు, రాచకొండ భాస్కర్, ముప్పాళ్ళ సాంబశివరావు, గాలి బాలాజీ, శరత్ బాబు, షేక్ మహబూబ్, అకనంబట్టు కుమార్ రెడ్డి, ఎలమంచిలి వెంకట సుబ్రహ్మణ్యేశ్వర రావు, అట్లూరి దీపక్ చౌదరి, ప్రసాద్, అంజి, గోవర్ధనాచారి, ఆర్కే చౌదరి, పట్లోళ్ల సాయినాథరెడ్డి, తులసి రెడ్డి, ఆర్ వి సత్యనారాయణ, మదన్,వెంకట్ రెడ్డి, నాగిరెడ్డి, నంద్యాల రవి, నరసింహులు, శ్రీనివాస్, తమ్మినేని ప్రవీణ్ కుమార్, గంధం కరుణాకర్ నాయుడు, కొక్కిలగడ్డ ఫణికుమార్, దొడ్డి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

# తిరుమలగిరిపై పచ్చదనంపై ప్రచారం

* **భక్తులకు అవగాహన కల్పించిన నైనిక రజువా**
* **పలువురిచే ప్రశంసలు అందుకున్న ప్రకృతి హరితదీక్షకురాలు**

ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: నిత్యం లోకనాయకుడి నామస్మరణతో మారుమ్రోగిపోయే తిరుమల కొండల్లో ప్రకృతిని కాపాడండంటూ ప్రకృతి హరితదీక్షకురాలు నైనిక చేసిన వినూత్న ప్రచారానికి ప్రశంసలజల్లు కురుస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని సెయింట్ మేరీస్ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న నైనిక రజువా శ్రీనివాసుడి దర్శనార్థం తిరుమలకు చేరుకున్న సందర్భంగా అలిపిరి వద్ద నుంచి మెట్ల మార్గంలో నడుచుకుంటూ కొండపైకి చేరుకుంది. ఈ క్రమంలోనే వీపునకు మొక్కను తగిలించుకుని, ముఖానికి ఆక్సీజన్ మాస్క్ పెట్టుకుని... నేడు మనం మొక్కలను నాటి వాటిని సంరక్షించకపోతే భవిష్యత్తులో మనం ఇలా మొక్కలను వీపుకు తగిలించుకునే పరిస్థితి వస్తుందంటూ 3,550 మెట్లు ఎక్కి చేసిన వినూత్న ప్రచారానికి భక్తులనుంచి సానుకూల స్పందన లభించింది. మెట్లమార్గంలో అలిపిరి, హనుమాన్ ఆలయం, మోకాళ్ల పర్వతం ప్రాంతాల్లో భక్తులు నైనిక రజువా చేపట్టిన ప్రచార వివరాలను అడిగిమరీ తెలుసుకుని నైనిక చేసిన ప్రయత్నాన్ని అభినందించారు. భక్తులకు పచ్చదనం ప్రాధాన్యతను వివరిస్తూ, మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవడం ఎంత అవసరమో వివరించింది. తిరుమల చేరుకున్న అనంతరం శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకొని పచ్చదనాన్ని పెంపొందించాలనే సంకల్పాన్ని వ్యక్తం చేసింది. తిరుమల ప్రాంగణంలో స్వామివారి సన్నిధిలో మారేడు, సింధూరపు మొక్కలను నాటింది. చిన్న వయసులోనే పర్యావరణంపై చూపిన ఈ చైతన్యానికి భక్తులు, స్థానికులు ప్రశంసలు కురిపించారు.

**– సైన్స్ ఫెయిర్, సీఎం సభలోనూ...**

ఇటీవల సెయింట్ మేరీస్ పాఠశాలలో నిర్వహించిన జిల్లాస్థాయి 2025-26 సైన్స్‌ఫేర్‌లోనూ నైనిక రజువా తన ప్రదర్శనతో పలువురి ప్రశంసలు అందుకుంది. "మొక్కలు నాటకపోతే భవిష్యత్తులో మొక్కను వీపున మోయాల్సి వస్తుంది'' అని చెప్తూ నైనిక చేసిన ప్రయత్నాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ నైనికను ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా ఇటీవల పాల్వంచలో నిర్వహించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలోనూ నైనిక చేపట్టిన మొక్కల పరిరక్షణ ప్రచారం ప్రత్యేక గుర్తింపు పొందింది. రెండు తెలుగు రాష్ట్రాల్లో మొక్కలు నాటాలని, వాటిని కాపాడుకోవాలనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలని నైనిక ధృడ నిశ్చయంతో ఉంది. ప్రకృతి హరితదీక్ష వ్యవస్థాపకులు, మన్‌కీబాత్‌లో ప్రధాని మోడీచే ప్రశంసలందుకున్న కొత్తగూడెం పట్టణానికి చెందిన సింగరేణిన్ మొక్కల రాజశేఖర్ వద్ద ప్రకృతి హరిత దీక్ష తీసుకున్న నైనిక గత కొన్ని నెలలుగా ప్రత్యేక రోజులలో విరివిగా మొక్కలు నాటడం, మొక్కలను బహుమతిగా ఇవ్వడం చేపడుతూ అందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన "ఏక్ పేడ్ మా కీ S నామ్'' కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని, సభలు, సమావేశాలు, పుట్టినరోజులు, పెళ్లిరోజు వంటి శుభకార్యక్రమాల్లో గిఫ్టుల స్థానంలో మొక్కలను బహుమతిగా ఇవ్వాలని ప్రచారం చేస్తోంది. ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని, స్టీల్ గ్లాసులు, బాటిళ్లలో నీరు తాగితే ఆరోగ్యంగా ఉండొచ్చని ప్రజలకు అవగాహన కల్పిస్తోంది.






**– మొక్కలు నాటితేనే భవిష్యత్తు పచ్చగా ఉంటుంది: నైనిక రజువా**

ప్రతి ఒక్కరూ అమ్మ పేరుతో ఒక మొక్క నాటండి.. నేడు మనం నాటే మొక్కలే భవిష్యత్తు తరాలకు పచ్చదనాన్ని, ఆక్సీజన్‌ను, నీడను, ఇతర వనరులను అందిస్తుంది. నేటి బాల బాలికలు ఎదిగేసరికి ప్రకృతి అంతా నాశనమై ఆక్సీజన్ కూడా దొరకని పరిస్థితి ఉంటుంది. మొక్కలు నాటడం ఒక్కటే కాకుండా ఆ మొక్కను సంరక్షించే బాధ్యత కూడా తీసుకుంటేనే ఆ మొక్క కాస్తా మహావృక్షం కాగలదు. ఎవరికివారు స్వచ్ఛందంగా నెలలో ఒక్కరోజైనా మొక్కలు నాటడానికి సమయం కేటాయించుకోవాలని నా విన్నపం.

# ఘనంగా హైదరాబాద్ బుక్ ఫెయిర్ ప్రారంభం

హైదరాబాద్: వ్యక్తుల్లో గుణాలు కల్తీ అవ్వడానికి కారణం పుస్తక పఠనం తగ్గిపోవడమేనని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్ 38వ ఎడిషన్‌ను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ప్రతి ఇల్లు లైబ్రరీగా మారినప్పుడు సమాజం కచ్చితంగా బాగుపడుతుందని మంత్రి అన్నారు. సాంస్కృతిక శాఖ నుంచి రూ.3 కోట్లు మంజూరు చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి.. జిల్లా కేంద్రాల్లో పుస్తక ప్రదర్శనశాలలు ఏర్పాటు చేయాలని బుక్ ఫెయిర్ నిర్వాహకులకు సూచించారు. పుస్తక పఠనం ద్వారా విషయాన్ని అమూలాగ్రం అవగాహన చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బుక్ ఫెయిర్ వంటి మంచి కార్యక్రమానికి తమ సహకారం ఉంటుందని భరోసానిచ్చారు. గ్రామాల్లో సర్పంచ్‌లు, నాయకులు గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. చదివిన వారు ఎప్పటికైనా గొప్ప స్థాయికి చేరుకుంటారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు కోదండరాం అన్నారు. పుస్తకం చదివే అలవాటు ఉంటే ఆత్మ పరిశీలన చేసుకోవడం చాలా సులువు అవుతుందని, అది విజయానికి దారితీస్తుందని చెప్పారు. చిన్ననాటి నుంచే పుస్తక పఠనం అలవడితే భవిష్యత్తు బంగారుమయంగా అవుతుందన్నారు. హైదరాబాద్ బుక్ ఫెయిర్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.





## సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో అగ్ని ప్రమాదం.. భారీగా ట్రాఫిక్ జామ్

రెజిమెంటల్ బజార్: రద్దీగా ఉండే సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. మోండా మార్కెట్‌లోని శ్రీరామ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ అలముకోవడంతో మార్కెట్ పరిసరాల్లో భారీగా ట్రాఫిక్ స్తంభించింది. అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని మంటలు ఇతర దుకాణాలకు వ్యాపించకుండా అదుపు చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన దుకాణంలో ప్లాస్టిక్ వస్తువులు ఎక్కువగా ఉండటంతో ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉందని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు.

## బాలికతో పెళ్లి.. భర్త, తండ్రికి జీవిత ఖైదు



హైదరాబాద్: బాలికతో పెళ్లి, అత్యాచారం కేసులో రంగారెడ్డి జిల్లా పోక్సో కోర్టు కీలక తీర్పు ఇచ్చింది. బాలిక భర్త, తండ్రికి జీవితఖైదు విధించింది. 2018లో హైదరాబాద్ సరూర్‌నగర్ పరిధిలో 17 ఏళ్ల బాలికకు బలవంతపు పెళ్లి చేశారు. ఈ కేసులో బాలిక భర్త, తండ్రికి జీవిత ఖైదుతో పాటు, రూ.75 వేల చొప్పున కోర్టు జరిమానా విధించింది. బాధితురాలికి రూ.15 లక్షల పరిహారం అందించాలని న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.



## తెలంగాణ డీజీపీ ఎదుట 41 మంది మావోయిస్టుల లొంగుబాటు

హైదరాబాద్: తెలంగాణ డీజీపీ ఎదుట 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. వారిలో కామారెడ్డికి చెందిన రాష్ట్ర కమిటీ కార్యదర్శి ఎర్రగొల్ల రవి ఎలియాస్ సంతోష్, మంచిర్యాలకు చెందిన కనికారపు ప్రభంజన్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఆరుగురు డివిజన్ కమిటీ సభ్యులు, ఇద్దరు సెంట్రల్ విజన్ కమాండర్లు ఉన్నారు. మిగతా మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందినవారిగా డీజీపీ శివధర్‌రెడ్డి వెల్లడించారు. లొంగుబాటు సందర్భంగా 24 తుపాకులను మావోయిస్టులు పోలీసులకు అప్పగించారు. ఈమేరకు తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. ''ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి పోలీసుల అమరవీరుల దినోత్సవం రోజున ఇచ్చిన పిలుపుమేరకు వీళ్లంతా వచ్చి లొంగిపోయారు. 2025లో ఇప్పటి వరకు 509 మంది మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. లొంగిపోవడానికి ప్రధాన కారణం 2026 మార్చి 31 వరకు కొత్త ప్రాంతాలకు వెళ్లాలని మావోయిస్టు పార్టీ నుంచి ఆదేశాలు వచ్చాయి. తెలియని ప్రాంతాలకు వెళ్లడం, నిత్యావసర వస్తువులు సరైన సమయంలో అందకపోవడం, కీలక నాయకులే లొంగిపోతున్న నేపథ్యంలో కిందిస్థాయి మావోయిస్టులు లొంగిపోయేందుకు ముందుకు వచ్చారు. ప్రభుత్వం లొంగిపోయిన వారికి క్యాడర్ ప్రకారం నగదు పరిహారం అందిస్తుంది. ఆయుధాలతో లొంగిపోయే వారికి కేంద్ర ప్రభుత్వం కూడా సహాయం చేస్తుంది. లొంగిపోయిన 41 మంది మావోయిస్టులపై రూ. 1.46 కోట్ల రివార్డు ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వారికి రావాల్సిన పరిహారాన్ని అందిస్తాం. తక్షణ సాయం కింద ఒక్కొక్కరికి రూ.25వేలను అందించనున్నాం. ఏ రాష్ట్రాలకు చెందిన వారిని ఆ రాష్ట్ర ప్రభుత్వాలకి అప్పగించనున్నాం. ప్రస్తుతం మావోయిస్టుల్లో మొత్తం 54 మంది తెలంగాణ వాళ్లు మాత్రమే ఉన్నారు. వీరిలో ఆరుగురు మాత్రమే తెలంగాణలో పనిచేస్తున్నారు. లొంగిపోయిన మావోయిస్టులు అప్పగించిన ఆయుధాలు దాదాపు అన్ని పోలీసుల నుంచి కొల్లగొట్టినవే. ఆర్మీ, పోలీసులు వద్ద ఉండే ఆయుధాలే వారి వద్ద ఉన్నాయి. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీసులకు ఆయుధాల సీరియల్ నెంబర్‌లపై సమాచారం ఇస్తాం. వారికి గతంలో మిస్సైన ఆయుధాలను అప్పగించనున్నాం'' అని డీజీపీ తెలిపారు.


## తెలంగాణలో పీఏసీఎస్‌లు, డీసీసీబీల పాలక వర్గాలు రద్దు




హైదరాబాద్: రాష్ట్ర సహకార కేంద్ర బ్యాంకు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకులు, వ్యవసాయ ప్రాథమిక సహకార సంఘాల పాలక వర్గాలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. టెస్కాబ్, డీసీసీబీలు, పీఏసీఎస్‌లకు అధికార్రులను ఇన్‌ఛార్జిలుగా నియమించేలా సహకార శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని 904 పీఏసీఎస్‌లు, 9 డీసీసీబీలతో పాటు టెస్కాబ్ పాలక మండళ్ల పదవీకాలం ఫిబ్రవరిలో ముగిసింది. గత పాలకవర్గాలనే పర్సన్ ఇంచార్జి మేనేజింగ్ కమిటీలుగా 6 నెలల పాటు కొనసాగిస్తూ ఫిబ్రవరి 14న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత నిరవధికంగా పొడిగిస్తూ ఆగస్టు 14న ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవోను రద్దు చేస్తూ పీఏసీఎస్, డీసీసీబీలు, టెస్కాబ్‌కు అధికారులను ఇన్‌ఛార్జిగా నియమిస్తూ ఇవాళ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త జిల్లాలకు అనుగుణంగా డీసీసీబీలు, కొత్త మండలాల ప్రకారం పీఏసీఎస్‌లను పునర్వ్యవస్థీకరించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

## ప్రభుత్వం మెచ్చిన భద్రాద్రి జిల్లా ఏజెన్సీ ఆసుపత్రుల సేవలు

- **స్ఫూర్తిదాయక వైద్య సేవలపై మంత్రి దామోదర రాజా నర్సింహా ప్రశంసలు**
- **డి.సి.హెచ్.ఎస్ డా. జి. రవి బాబు, చర్ల సహా ఏజెన్సీ ఆసుపత్రి సిబ్బందికి ప్రత్యేక అభినందనలు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో టీవీవీపీ ఆసుపత్రులు అద్భుతమైన వైద్య సేవలు అందిస్తున్నాయని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహా ప్రశంసించారు. అంకితభావంతో పనిచేస్తూ ఇతర జిల్లాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ (డి.సి.హెచ్.ఎస్) డా.జి.రవి బాబు, చర్ల, మణుగూరు, భద్రాచలం, ఎల్లందు, అశ్వారావుపేట ఆసుపత్రుల సూపరింటెండెంట్లు మరియు సిబ్బందిని రాష్ట్ర సచివాలయానికి ఆహ్వానించిన మంత్రి, ఆరోగ్య శాఖ ప్రధాన కార్యదర్శి క్రిస్టినాతో కలిసి వారికి జ్ఞాపికలు అందించి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మారుమూల ఏజెన్సీ ప్రాంతమైన చర్లలో సైతం అందుబాటులో ఉన్న వసతులతో నాణ్యమైన వైద్యం అందించడం అభినందనీయమని మంత్రి అన్నారు. చర్ల ఆసుపత్రి స్ఫూర్తితో ఇతర జిల్లాల ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా ఇదే తరహా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఇటీవల చర్ల ఆసుపత్రి వైద్య సదుపాయాలపై జాతీయ పత్రికల్లో ప్రధాన శీర్షికలుగా ప్రచురితమైన వార్తల నేపథ్యంలో మంత్రి స్పందించారు. ఆసుపత్రుల సూపరింటెండెంట్లు, సిబ్బంది ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ జిల్లా ఆసుపత్రులను అభివృద్ధి చేశారని, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని అనేక సవాళ్లను ఎదుర్కొంటూ ప్రభుత్వ ఆసుపత్రులను ప్రైవేట్ ఆసుపత్రులకు దీటుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించిన డి.సి.హెచ్.ఎస్ డా. జి. రవి బాబును మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరగడానికి ఆయన చేసిన కృషి ప్రశంసనీయమని అన్నారు.

## ప్రజావాణిలో 74శాతం ఫిర్యాదులు పరిష్కరించాం: డిప్యూటీ సీఎం



హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో ప్రజా సమస్యల పరిష్కారమే రాష్ట్ర ప్రభుత్వం ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ప్రజావాణి ప్రారంభించిన రెండేళ్లల్లో ఇప్పటి వరకు 74 శాతం ఫిర్యాదులు పరిష్కరించామని తెలిపారు. బేగంపేట ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్రస్థాయి ప్రజావాణి 2వ వార్షికోత్సవానికి భట్టి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రజావాణి ఇన్‌ఛార్జి దివ్యదేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారుల తమ అనుభవాల పంచుకున్నారు. అంకితభావంతో సేవలు అందించి.. ఫిర్యాదుల పరిష్కారానికి కృషి చేసిన అధికారులను సన్మానించారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ... రాష్ట్రంలోని వివిధ వర్గాల నుంచి వస్తున్న అనేక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక సాఫ్ట్‌వేర్ రూపొందించి, అన్ని శాఖలతో సమన్వయం చేస్తున్నామని తెలిపారు. ప్రజావాణికి స్పందన లేదని విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని ఆక్షేపించారు. ఎంత దుష్ప్రచారం చేసినా ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. అధికారానికి దూరమైన విపక్షం ఎన్ని విమర్శలు చేసినా.. తాము మరింత ముందుకు వెళ్తామన్నారు. పోరాడి తెచ్చుకున్న తెలంగాణలో వనరులు ప్రజలకు ఉపయోగపడేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజావాణి విజయవంతం చేసిన చిన్నారెడ్డి, దివ్యాదేవరాజన్‌కు భట్టి అభినందనలు తెలిపారు.

## పంట రుణం చెల్లించేందుకు నకిలీ రూ.500 నోట్లు.. పరారీలో రైతు

వర్ని: ఓ వ్యక్తి బ్యాంకులో పంట రుణం చెల్లించేందుకు తీసుకొచ్చిన నగదు పూర్తిగా దొంగ నోట్లుగా బ్యాంకు అధికారులు గుర్తించారు. రైతు తీసుకొచ్చిన రూ. 2,08,500 (అన్నీ రూ.500 నోట్లు) నకిలీగా తేల్చారు. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా వర్ని మండల కేంద్రంలో చోటు చేసుకుంది. బ్యాంకు అధికారులు వర్ని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లాలోని జలాల్పూర్ గ్రామానికి చెందిన రైతు నరెడ్ల చిన్నసాయిలు పంట రుణం చెల్లించేందుకు గురువారం సాయంత్రం వర్ని మండల కేంద్రంలోని కెనరా బ్యాంకుకు రూ. 2,08,500 (అన్నీ రూ.500 నోట్లు) తీసుకొచ్చాడు. ఈ క్రమంలో నగదును చెల్లించేందుకు క్యాష్ కౌంటర్‌లో ఇచ్చాడు. క్యాష్ కౌంటింగ్ యంత్రంలో నోట్లను లెక్కిస్తుండగా నకిలీ నోట్లు వచ్చాయి. అప్రమత్తమైన బ్యాంకు అధికారులు, సిబ్బంది డబ్బు ఎక్కడి నుంచి తెచ్చావని రైతును ప్రశ్నించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. రైతు తీసుకొచ్చిన రూ. 500 నోట్లను బ్యాంకు సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించగా.. అవన్నీ నకిలీ నోట్లేనని గుర్తించారు. నాలుగు రూ.500 నోట్ల కట్టలపై ఒక్కొక్క కట్టపై ఒకేరకమైన క్రమసంఖ్య (సీరియల్ నంబర్) ఉండటాన్ని గుర్తించారు. దీంతో నకిలీనోట్లని నిర్ధరించి గురువారం రాత్రి వర్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. బ్యాంకు అధికారి పంకజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



నకిలీ నోట్ల వ్యవహారం వర్ని మండలంలో కలకలం సృష్టించింది. పరారీలో ఉన్న రైతు కోసం పోలీసులు గాలిస్తున్నారు.

## హరీశ్‌రావు పెద్ద మనసు.. పేద విద్యార్థిని కోసం ఇంటిని తాకట్టుపెట్టి..!



సిద్దిపేట: బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు తన పెద్ద మనసును చాటుకున్నారు. పీజీ వైద్యవిద్య చదువుతున్న ఓ పేద విద్యార్థినికి రుణం కోసం తన ఇంటిని తనఖా పెట్టారు. విద్యార్థిని మమత చదువు కోసం ఏటా రూ.7.50 లక్షలు చెల్లించాలని కళాశాల యాజమాన్యం తెలిపింది. ఏదైనా ఆస్తి తనఖా పెడితేనే రుణం ఇస్తామని బ్యాంకర్లు స్పష్టం చేశారు. ఈ విషయాన్ని హరీశ్‌రావు దృష్టికి మమత, ఆమె తండ్రి రామచంద్రం తీసుకెళ్లారు. దీంతో ఆయన సిద్దిపేటలోని తన ఇంటిని తనఖా పెట్టి రూ.20 లక్షల విద్యారుణం ఇప్పించారు. విద్యార్థిని హాస్టల్ ఫీజు కోసం రూ.లక్ష నగదు అందజేశారు.


## జయత్రీ ఇన్‌ఫ్రా ఎండీ శ్రీనివాస్ అరెస్ట్

హైదరాబాద్: జయత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సంస్థ కేసులో ఎండీ శ్రీనివాస్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్ట్ చేసింది. గత కొన్నాళ్లుగా తప్పించుకుని తిరుగుతున్న ఆయన్ను చెన్నైలో అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నేడు కోర్టులో హాజరుపరచనున్నారు. ప్రీలాంచ్ ఆఫర్ పేరుతో కాకర్ల శ్రీనివాస్ పలువురి నుంచి రూ.60 కోట్లకు పైగా వసూలు చేశారు. గతంలో హైదరాబాద్ సీసీఎస్‌లో నమోదైన కేసు ఆధారంగా ఈడీ మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నవంబర్‌లో నగరంలోని 8 చోట్ల సోదాలు చేపట్టింది. జయత్రీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, దాని అనుబంధ సంస్థల్లో తనిఖీలు చేసి పలు డాక్యుమెంట్లు, బ్యాంకు ఖాతాలను స్తంభింపజేసింది.

# శబరిమల బంగారం చోరీ కేసు.. ఈడీకి అప్పగింత...

తిరువనంతపురం: శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు విగ్రహాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌కు కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. ఈ సందర్భంగా కేసులో కీలక పత్రాలు, సాక్షుల వాంగ్మూలాలు సహా సంబంధిత దస్త్రాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు నమోదైన రెండు ఎఫ్ఐఆర్ కాపీలు, ఇప్పటివరకు అరెస్టైన ఏడుగురికి సంబంధించి సిట్ దాఖలు చేసిన రిమాండ్ రిపోర్టులు సహా ఇతర కీలక దస్త్రాలను ఈడీకి తక్షణమే ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది. తద్వారా ఈడీ దీనిపై మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయనుందని సమాచారం. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేయాలంటే పోలీసు డాక్యుమెంట్లు తప్పనిసరి అని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఈ వ్యవహారంలో ఈడీ ఇప్పటికే ప్రాథమిక దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది. సంచలనం రేపిన శబరిమల ఆలయంలోని




విగ్రహాల బంగారు తాపడం బరువులో వ్యత్యాసం కేసుపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ప్రత్యేక దర్యాప్తు బృందం దర్యాప్తు చేస్తోంది. ఈ సమయంలో మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టేందుకు అనుమతించాలని కోరుతూ ఈడీ తొలుత కేరళ హైకోర్టును ఆశ్రయించింది. హైకోర్టు సూచన మేరకు కొల్లాం విజిలెన్స్ కోర్టులో పిటిషన్ వేయగా.. కేంద్ర దర్యాప్తు బృందం విజ్ఞప్తిని సిట్ వ్యతిరేకించింది. ఒకేసారి రెండూ కొనసాగడం దర్యాప్తును ప్రభావితం చేస్తాయని అభిప్రాయపడింది. అయినప్పటికీ విజిలెన్స్ కోర్టు మాత్రం ఈడీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

# హోంగార్డు ఉద్యోగాలకు ఎంబీఏ, ఎంసీఏ పట్టభద్రుల పోటీ!

భువనేశ్వర్: ఒడిశాలోని 187 హోంగార్డు పోస్టుల భర్తీకి అక్కడి పోలీస్‌శాఖ మూడు రోజుల క్రితం రాత పరీక్ష నిర్వహించింది. మొత్తం 8000 మంది అభ్యర్థులు పోటీపడగా.. అందులో ఎంబీఏ, ఎంసీఏ పట్టభద్రులు కూడా ఉన్నారు. దీనిపై తాజాగా తృణమూల్ కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భాజపా పాలిత రాష్ట్రంలో నిరుద్యోగుల పరిస్థితి ఇలా ఉందంటూ ఎద్దేవా చేసింది. హోంగార్డు అభ్యర్థులకు సంబల్‌పూర్‌లో డిసెంబర్ 16న రాత పరీక్ష నిర్వహించారు. పెద్ద ఎత్తున అభ్యర్థులు రావడంతో వారిని అదుపు చేసేందుకు ప్రత్యేక బలగాలను రప్పించాల్సి వచ్చింది. డ్రోన్లతో పర్యవేక్షించాల్సిన పరిస్థితి తలెత్తింది. దీనికి సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ వ్యంగ్యంగా స్పందిస్తూ.. ''రోజుకు రూ.639 వచ్చే



ఉద్యోగానికి పోస్టు గ్రాడ్యుయేట్‌లు పోటీ పడుతున్నారు. చేతిలో డిగ్రీలు ఉన్నా.. కొలువులు మాత్రం లేవు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకొంటున్న భాజపా ప్రభుత్వం తీరు ఇలా ఉంది'' అని ఎక్స్‌లో విమర్శించింది.

# స్కూల్లో చేరితే విద్యార్థి ఖాతాలో రూ.5 వేలు

మంగళూరు: కర్ణాటకలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం తగ్గుముఖం పడుతున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళూరులో వందేళ్ల చరిత్ర ఉన్న అశోక్‌నగర్ ప్రాథమికోన్నత పాఠశాల (కన్నడ మీడియం) ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. స్కూల్లో కొత్తగా చేరే విద్యార్థుల పేరుతో ఉచితంగా బ్యాంకు ఖాతా తెరవడంతోపాటు అందులో రూ.5 వేలు జమ చేస్తోంది. జిల్లాలో ఇటువంటి కార్యక్రమం చేపట్టడం ఇదే తొలిసారి అని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చేలా తల్లిదండ్రులను ప్రోత్సహించేందుకు దీన్ని మొదలుపెట్టినట్లు అధికారులు వెల్లడించారు. దాతల సహకారంతో



దీన్ని చేపడుతున్నామన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 17 మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలు తెరిచి, నగదు జమ చేసినట్లు పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. వీరిలో ఒకటో తరగతి విద్యార్థులే పది మంది ఉన్నారని చెప్పారు. ఐదేళ్ల కాలానికి ఈ నగదును ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తున్నామన్నారు. అయితే, ఇక్కడ పూర్తి స్థాయిలో బోధించేందుకు ఉపాధ్యాయుల కొరత ఉందని, గెస్ట్ టీచర్ల సాయంతోనే పాఠశాల నడుస్తోందన్నారు. అయినప్పటికీ విద్యార్థులకు ఉచితంగా యక్షగానం, కరాటే, పెయింటింగ్, యోగాల్లో శిక్షణ ఇస్తున్నామన్నారు.

## భారత సాంకేతిక నిపుణుడికి

# యూఎస్‌లో అరుదైన గౌరవం

హ్యూస్టన్: భారతదేశానికి చెందిన సాంకేతిక నిపుణుడు సంజోయ్ పాల్‌కు అరుదైన గౌరవం దక్కింది. అమెరికాలో విద్యారంగంలో ఆవిష్కర్తలకు ఇచ్చే అత్యున్నత నేషనల్ అకాడమీ ఆఫ్ ఇన్వెంటర్స్ (ఎన్ఏఐ) జాబితాలో స్థానం సంపాదించారు. ఈ మేరకు అకాడమీ ఇటీవల ప్రకటించింది. పాల్ ప్రస్తుతం రైస్ నెక్సస్ ఇన్నోవేషన్ హబ్, ఏఐ హ్యూస్టన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా, రైస్ యూనివర్సిటీ టెక్నాలజీ డెవలప్‌మెంట్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2025 సంవత్సరానికి సంబంధించి 169 మంది ఎంపిక కాగా.. అందులో పాల్ కూడా ఉన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ విభాగంలో పాల్ 95 పేటెంట్ హక్కులను సొంతం చేసుకున్నారు. అంతేకాకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, నెట్‌వర్కింగ్, ది ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ విభాగాల్లో గుర్తింపు పొందారు. అంతకుముందు పాల్.. బెల్ ల్యాబ్స్, విప్రో, ఇన్ఫోసిస్, యాక్సెంచర్ సంస్థల్లో సీనియర్



రీసెర్చ్, లీడర్‌షిప్ బాధ్యతలు నిర్వర్తించారు. ఏఐ, రోబోటిక్స్, 5జీ, డిజిటల్ ట్విన్ టెక్నాలజీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్‌లో కీలక పాత్ర పోషించారు. ఐఐటీ ఖరగ్‌పూర్ నుంచి పట్టభద్రులైన పాల్.. థామస్ ఆల్వా ఎడిసన్ పేటెంట్ అవార్డు, విలియం ఆర్. బెన్నెట్ అవార్డ్, ఇన్ఫోసిస్ ఎక్సలెంట్ అవార్డ్, ఎంఐటీ టెక్నాలజీ రివ్యూస్ గ్రాండ్ ఛాలెంజెస్ ఫర్ ఇండియా అవార్డ్ సహా పలు పురస్కారాలను అందుకున్నారు.

# బెట్టింగ్ యాప్ కేసు.. యువరాజ్ సింగ్, సోనూసూద్ ఆస్తులు అటాచ్

బెట్టింగ్ యాప్స్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణ ముమ్మరంగా సాగుతోంది. ఈ కేసులో తాజాగా కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ క్రికెటర్లు యువరాజ్ సింగ్, రాబిన్ ఉతప్ప, బాలీవుడ్ నటులు సోనూసూద్, నేహాశర్మ ఆస్తుల్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అటాచ్ చేసింది. ఆ జాబితాలో నటి ఊర్వశీ రౌతేలా తల్లితో పాటు టీఎంసీ మాజీ ఎంపీ మిమీ చక్రవర్తి, అంకుశ్ హజ్రా (బెంగాలీ నటుడు) కూడా ఉన్నారు. ఈ కేసుకు సంబంధించి దర్యాప్తు సంస్థ వీరిని ఇప్పటికే విచారించగా.. తాజాగా అటాచ్ చేసిన



ఆస్తుల విలువ రూ.7.93 కోట్లని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో మాజీ క్రికెటర్లు సురేశ్ రైనా, శిఖర్ ధావన్‌కు చెందిన రూ.11.14 కోట్ల విలువైన ఆస్తులను ఈడీ అటాచ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ ఇద్దరు మాజీ క్రికెటర్లు అన్ని విషయాలు తెలిసే 1xBet, దాని అనుబంధ సంస్థల ప్రమోషన్ కోసం విదేశీ సంస్థలతో ఒప్పందాలు చేసుకున్నారని గుర్తించింది. ఈ నేపథ్యంలోనే శిఖర్ ధావన్‌కు చెందిన రూ.4.5 కోట్ల స్థిరాస్తిని, సురేశ్‌కు చెందిన రూ.6.64 కోట్ల విలువైన మ్యూచువల్ ఫండ్‌లను సీజ్ చేసేందుకు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల పార్లమెంట్ వేదికగా రియల్ మనీ ఆన్‌లైన్ గేమింగ్‌ను బ్యాన్ చేసిన సంగతి తెలిసిందే.

# ఎస్ఐఆర్: తమిళనాడు, గుజరాత్‌లో లక్షల్లో ఓట్ల తొలగింపు


దిల్లీ: వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడులో కేంద్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ చేపడుతోంది. ఇప్పటికే తొలి విడత ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో శుక్రవారం ఓటర్ల ముసాయిదా జాబితాను విడుదల చేసింది. గత జాబితాతో పోలిస్తే 97 లక్షల ఓటర్ల పేర్లను తొలగించింది. ఎస్ఐఆర్ ప్రక్రియ చేపట్టడానికి ముందు రాష్ట్రంలో 6.41 కోట్ల ఓటర్లు ఉండగా.. ప్రస్తుత జాబితాలో 5.43 కోట్ల మంది మాత్రమే ఉన్నారు. తొలిగించిన వారిలో 27 లక్షల మంది మృతి చెందగా.. 66 లక్షల మంది ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డారని, మరో 3.4 లక్షల మంది డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. ఓటు హక్కు కోల్పోయిన వారు జనవరి 18లోగా అభ్యంతరాలు తెలిపేందుకు ఈసీ అవకాశం కల్పించింది.

*** గుజరాత్‌లో 73.73 లక్షల ఓట్లు**




**తొలగింపు**

మరోవైపు గుజరాత్‌కు సంబంధించిన ఓటరు ముసాయిదా జాబితాను కూడా ఈసీ ప్రకటించింది. మొత్తం 73.73 లక్షల ఓట్లను తొలగించినట్లు పేర్కొంది. రాష్ట్రంలో మొత్తం 5.08 కోట్ల మంది ఓటర్లకు గానూ.. ముసాయిదా జాబితాలో 4.34 కోట్ల మంది మాత్రమే ఉన్నారు. తొలగించిన వారిలో 18 లక్షల మంది మృతి చెందగా, 40 లక్షల మంది ఇతర రాష్ట్రాల్లో స్థిరపడ్డారని, 3.81 లక్షల మందికి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటు హక్కు ఉందని ఈసీ వెల్లడించింది. గుజరాత్‌లో నవంబర్ 4న ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంభించిన ఈసీ.. డిసెంబర్ 14తో ముగించింది. అభ్యంతరాలు తెలిపేందుకు జనవరి 18 వరకు అవకాశం కల్పించింది.





# కలలు కని.. సాకారం చేసుకొని.. ఫ్లయింగ్ ఆఫీసర్‌గా సమృద్ధి వామన్

పుణె: వాయుసేనలో చేరాలని చిన్నప్పటి నుంచి కలలు కన్న ఓ యువతి.. అందుకు తగినట్లు శ్రమించి వాటిని సాకారం చేసుకున్నారు. పుణెలోని జున్నార్ తాలుకా ఖోడద్‌కి చెందిన సమృద్ధి వామన్.. వాయుసేనలో ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. శ్రమ, అంకితభావమే ఈ విజయానికి దోహదం చేశాయని ఆమె చెబుతున్నారు. తారాపుర్‌లోని అటామిక్ ఎనర్జీ సెంట్రల్ స్కూల్‌లో పాఠశాల విద్య పూర్తి చేసిన సమృద్ధి.. కోయంబత్తూర్‌లోని అమృతా యూనివర్సిటీ నుంచి ఇంజినీరింగ్ పూర్తిచేశారు. ఆ తర్వాత ఎయిర్ ఫోర్స్ ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ఫ్లయింగ్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. సమృద్ధి తల్లి అరుణ పోలీసు శాఖలో పనిచేస్తున్నారు. తండ్రి అజిత్ ఇన్సూరెన్స్ అడ్వైజర్. టాటా పవర్‌లో లీడ్ ఇంజినీర్‌గా పనిచేస్తూనే వాయుసేన కోసం సమృద్ధి సిద్ధమయ్యారు. కుటుంబ సభ్యులు, రక్షణశాఖ రిటైర్డ్ అధికారుల మార్గనిర్దేశంతో ముందుకెళ్లారు. ప్రవేశ పరీక్షలో ఉత్తీర్ణత సాధించడంతోపాటు తదనంతర పరీక్షల్లోనూ నెగ్గారు. చివరకు ఇంటర్వ్యూలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారు. ప్రతిఒక్కరికీ ఆశయాలు ఉండాలని, వాటిని సాధించేందుకు కృషి చేయాలని సమృద్ధి సూచిస్తున్నారు. దృఢసంకల్పంతో ప్రయత్నిస్తే కచ్చితంగా అవి నెరవేరుతాయని అంటున్నారు.

# ఆ వీడియో మాయలో పడొద్దు: రాజ్యసభ ఎంపీ సుధామూర్తి

పలు సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని తాను సూచిస్తున్నట్లుగా సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోన్న వీడియో ఫేక్ అని రాజ్యసభ ఎంపీ సుధామూర్తి పేర్కొన్నారు. పెట్టుబడులు పెట్టాలని తాను ఎప్పుడూ చెప్పనని.. ఇటువంటి డీప్‌ఫేక్ వీడియోల మాయలో పడొద్దని ప్రజలకు సూచించారు.

వైరలైన వీడియోలో అధిక రాబడులు పొందడానికి తాను



సూచించిన సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఆయా సంస్థల్లో పెట్టుబడులు పెట్టడానికి స్క్రీన్‌పై కనిపిస్తున్న లింక్‌పై క్లిక్ చేయమని వీక్షకులను కోరుతున్నట్లు చూపిస్తోంది. ''ఇప్పటికే చాలామంది పెట్టుబడిదారులు ఇందులో చేరి, నెలకు రూ.10 లక్షల వరకు సంపాదిస్తున్నారు. ఎక్కువ మంది దీనిలో చేరుతున్నందున రిజిస్ట్రేషన్లను నేటితో ముగిస్తున్నాం. అందుకే ఇందులో చేరాలనుకునేవారు వీడియో కింద కనిపిస్తున్న లింక్ ద్వారా వెంటనే చేరండి'' అని సుధామూర్తి చెబుతున్నట్లు ఉంది. ఈ వీడియోపై సుధామూర్తి స్పందిస్తూ..డీప్‌ఫేక్ వీడియోలపై ఆందోళన వ్యక్తం చేశారు. తాను ఎటువంటి పెట్టుబడులు పెట్టాలని ఎవరికీ సూచించనని.. ఇటువంటి వీడియోలు చూసి ఎవరూ మోసపోవద్దని కోరారు. వాటి వెనక ఉన్న వ్యక్తులను గుర్తించి చర్యలు తీసుకోవాలని సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

# డిజిటల్ అరెస్ట్ కేసులో కాకినాడకు చెందిన ఇద్దరు అరెస్ట్



కాకినాడ: డిజిటల్ అరెస్ట్ల పేరుతో భారీ మోసాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. కాకినాడకు చెందిన సూరంపూడి చంద్రశేఖర్, ఇమంది వెంకట్ నవీన్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు.. మరి కొందరు నిందితుల కోసం కోసం గాలిస్తున్నారు. ఇటీవల కాకినాడకు చెందిన విశ్రాంత ఉద్యోగికి వాట్సాప్ కాల్ చేసిన సైబర్ ముఠా.. డిజిటల్ అరెస్ట్ అంటూ భయపెట్టి రూ.59లక్షలు వసూలు చేశారు. ఆర్టీజీఎస్ ద్వారా డబ్బులు బదిలీ చేయించుకున్న నిందితులు.. ఆ తర్వాత షెల్ కంపెనీ ఖాతాల ద్వారా క్రిప్టో కరెన్సీగా మార్చారు. బైనాన్స్ P2P ద్వారా వ్యక్తిగత ఖాతాల్లోకి నగదు జమ చేసుకున్నారు. దేశవ్యాప్తంగా 65 సైబర్ కేసుల్లో నిందితుల పాత్ర ఉన్నట్లు గుర్తించారు. ఇప్పటి వరకు వీరు.. సైబర్ మోసాల ద్వారా రూ.8 కోట్లు కాజేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. నిందితుల నుంచి 5 సెల్‌ఫోన్లు, 10 డెబిట్ కార్డులు, చెక్ బుక్స్, పాన్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరికొందరు నిందితుల కోసం గాలిస్తున్నామని పోలీసులు తెలిపారు.

## పరకామణి లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించండి: హైకోర్టు కీలక ఆదేశాలు




అమరావతి: తిరుమల శ్రీవారి ఆలయ పరకామణి కానుకల లెక్కింపుపై ఏపీ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. లెక్కింపులో మానవ ప్రమేయాన్ని తగ్గించాలని తితిదేను ఆదేశించింది. ఏఐ, అత్యాధునిక యంత్రాలను వినియోగించాలని సూచించింది. దొంగతనాలను అరికట్టేందుకు రెండు దశల్లో సంస్కరణలు చేపట్టాలని.. తక్షణ, శాశ్వత ప్రణాళికలు రూపొందించాలని స్పష్టం చేసింది. హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపులో భద్రతా చర్యలపై రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని హైకోర్టు ఆదేశించింది. కానుకలను వర్గీకరించడంతో పాటు విదేశీ కరెన్సీని గుర్తించేందుకు ఏఐని ఉపయోగించాలని సూచించింది. విలువైన లోహాలను వేరు చేసే అత్యాధునిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని పేర్కొంది. దీనిపై 8 వారాల్లోపు ముసాయిదా రూపొందించి సమర్పించాలని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది.

## నబీన్ నాయకత్వంలో భాజపా మరింత అభివృద్ధి చెందాలి

**: సీఎం చంద్రబాబు**



దిల్లీ: భాజపా జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు నితిన్ నబీన్ నాయకత్వంలో ఆ పార్టీ మరింత అభివృద్ధి చెందాలని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆకాంక్షించారు. ఇటీవలే బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్‌ను దిల్లీలో కలిసి అభినందించారు. అనంతరం చంద్రబాబు మీడియాతో మాట్లాడారు. ''ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం అత్యంత వేగంగా ముందుకు సాగుతోంది. ఈ ప్రయాణంలో అందరం కలిసికట్టుగా పని చేశాం, ఇకపై కూడా అలాగే నిలబడతాం. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నబీన్‌ను కలసి అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన యువకుడు, ఉత్సాహవంతుడు. వరుసగా ఎన్నికల్లో విజయాలు సాధిస్తూ ముందుకు సాగుతున్నారు. ఇది దేశానికి కూడా చాలా కీలకమైన సమయం. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ భారతదేశ బ్రాండ్‌ను ప్రపంచమంతటా గుర్తింపు పొందే స్థాయికి తీసుకువచ్చారు. రైట్ టైమ్, రైట్ లీడర్, రైట్ డెసిషన్.. అది నరేంద్ర మోదీ. అలాంటి పార్టీకి ఈరోజు నబీన్ కీలక బాధ్యతలు స్వీకరించడం ఎంతో శుభప్రదం. వారి నాయకత్వంలో దేశం అన్ని విధాలా మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆకాంక్షిస్తూ, మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నా'' అని చంద్రబాబు తెలిపారు.

## మాజీ సైనికుల సమస్యలు పరిష్కరిస్తాం: గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్



విజయవాడ: మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అన్నారు. శుక్రవారం లోక్‌భవన్‌లోని దర్బార్ హాల్‌లో జరిగిన సాయుధ దళాల పతాక దినోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ అబ్దుల్ నజీర్ మాట్లాడుతూ.. భారత సాయుధ దళాలకు దేశ ప్రజలందరి హృదయాలలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఏటా నిర్వహించే సాయుధ దళాల పతాక దినోత్సవం వారి శౌర్యం, విధి నిర్వహణ పట్ల అంకితభావం, అత్యున్నత స్థాయి నైపుణ్యానికి అభివందనం చేయడానికి ఒక ప్రత్యేక సందర్భం అని పేర్కొన్నారు. సైనిక సంక్షేమ శాఖ.. మాజీ సైనికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ చర్యల సంకలనం 'మార్గదర్శి'ని గవర్నర్ విడుదల చేశారు. కార్యక్రమంలో హోం మంత్రి వంగలపూడి అనిత, గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.అనంత రాము, హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్, గవర్నర్ సంయుక్త కార్యదర్శి పీఎస్ సూర్యప్రకాష్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు



## జగన్ బంధువు అర్జున్‌రెడ్డిని విచారించిన పోలీసులు

గుడివాడ: కృష్ణా జిల్లా గుడివాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జగన్ బంధువు అర్జున్ రెడ్డి విచారణ ముగిసింది. అర్జున్ రెడ్డి, వైకాపా నాయకులు స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. సోషల్ మీడియాలో అభ్యంతరకర పోస్టులు పెట్టినందుకు 2024లో సిరిగిరి అర్జున్ రెడ్డిపై కేసు నమోదు చేశామని గుడివాడ టు టౌన్ సీఐ హనీష్ తెలిపారు. ఇటీవల ఆయనకు 41ఏ నోటీసులిచ్చామని, కేసు విషయమై విచారించినట్టు చెప్పారు. తదుపరి విచారణ కొనసాగుతుందని తెలిపారు.

**కొడాలి నాని అనుచరుడు అరెస్ట్**

మరోవైపు వైకాపా నేత, మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు కూనసాని వినోద్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నందున అతడిని గుడివాడ వన్‌టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వినోద్ నుంచి రూ.50వేల నగదు, మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. వైకాపా అధికారంలో ఉండగా అడ్డూ అదుపు లేకుండా జూద శిబిరాలు నిర్వహించినట్లు అతడిపై ఆరోపణలున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక కూడా ఆ శిబిరాలు నిర్వహిస్తుండటంతో పోలీసులు వినోద్‌పై కేసు నమోదు చేశారు.

## కోటి సంతకాల పేరుతో జగన్ డ్రామా.. అది ఫెయిలైంది: సీఎం చంద్రబాబు



దిల్లీ: రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో జగన్‌కి ఎదురుదెబ్బలే ఎక్కువగా తగులుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. దిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమయ్యారు. తెదేపా పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సుమారు 40 నిమిషాల పాటు వివిధ అంశాలపై వారితో మాట్లాడారు. ''ఒక్క వైద్య కళాశాలల పీపీపీ వ్యవహారం మాత్రమే వైకాపాకు దొరికింది. ఆ విషయంలో కూడా ప్రజలు వాళ్లకి అవకాశం ఇవ్వలేదు. కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని జగన్ చూశారు. కానీ.. అది కూడా ఫెయిలైంది. దిల్లీ స్థాయిలోనూ పీపీపీ విధానంపై ఎంపీలు అధ్యయనం చేయాలి'' అని చంద్రబాబు సూచించారు. ప్రస్తుతం దిల్లీ, గుజరాత్ రాష్ట్రాల్లో పీపీపీ పద్ధతిలో ఆస్పత్రులు నడుస్తున్న విషయాన్ని పలువురు ఎంపీలు సీఎంకు వివరించారు. మనకు గుర్తింపు పెరుగుతున్న కొద్దీ బాధ్యత ఎక్కువ అవుతుందని చంద్రబాబు అన్నారు. మరింత బాధ్యతతో పనిచేయాల్సిన అవసరముందని చెప్పారు.


## జగన్‌కు యువతపై ఇంత ద్వేషమా?

**: మంత్రి లోకేశ్**



అమరావతి: ఐటీ పెట్టుబడులు, యువత ఉద్యోగాలపై వైకాపా కుట్ర చేస్తోందని మంత్రి నారా లోకేశ్ (Nara Lokesh) విమర్శించారు. ఇప్పటికే టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వా వంటి సంస్థలపై కోర్టులో వైకాపా పిల్ వేసిందన్నారు. తాజాగా రహేజా ఐటీ పార్కు పైనా పిల్ దాఖలు చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు 'ఎక్స్'లో ఆయన పోస్ట్ పెట్టారు. ''ఈ ప్రాజెక్టులతో ఏపీ యువతకు లక్షకు పైగా ఉద్యోగాలు అందించే అవకాశముంది. యువత భవిష్యత్తుపై జగన్‌కు ఇంత ద్వేషమెందుకు? రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు, ఉద్యోగాలను అడ్డుకోవాలనే ఆలోచన సబబా?'' అని లోకేశ్ నిలదీశారు.

## కల్తీ నెయ్యి కేసు.. కీలక పరిణామం



కల్తీ నెయ్యి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. మాజీ అధికారి సుబ్రహ్మణ్యం బెయిల్ పిటిషన్‌ను విజయవాడ ఏసీబీ కోర్టు తిరస్కరించింది. టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పీఏ అప్పన్న ఒత్తిడి చేయడం వల్లే నెయ్యిని కల్తీ చేశారని సుబ్రహ్మణ్యంపై ఆరోపణలు రావడంతో ఆయన్ను అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో తనకు బెయిల్ ఇవ్వాలని కోరుతూ సుబ్రహ్మణ్యం పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను ధర్మాసనం తిరస్కరించింది. కాగా జగన్ ప్రభుత్వ హయాంలో సుబ్రహ్మణ్యం టీటీడీ కొనుగోళ్ల విభాగంలో పని చేశారు. ఆ సమయంలో లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యిలో కల్తీ జరిగినట్లు కూటమి ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు దర్యాప్తు చేయాలని సిట్‌కు అప్పగించింది. కేసు దర్యాప్తు చేసిన సిట్ అధికారులు.. టీటీడీలో పని చేసిన ఉద్యోగులు కల్తీ ఘటనలో ప్రమేయం ఉన్నట్లు గుర్తించింది. ఈ మేరకు మాజీ అధికారి సుబ్రహ్మణ్యంను కూడా అరెస్ట్ చేసి విచారించింది. అనంతరం కోర్టులో ప్రవేశపెట్టడంతో జడ్జి రిమాండ్ విధించారు. దీంతో ఆయన్ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ప్రస్తుతం సుబ్రహ్మణ్యం రిమాండ్ ఖైదీగా జైలులో ఉన్నారు.

## నిరుద్యోగులకు గుడ్ న్యూస్..

### జాబ్ క్యాలెండర్ అప్డేట్

నిరుద్యోగులకు మంత్రి నారా లోకేష్ గుడ్ న్యూస్ చెప్పారు. జాబ్ క్యాలెండర్ అప్డేట్ ఇచ్చారు. వచ్చే ఏడాది జనవరిలో తప్పనిసరిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించారు. రాజమండ్రిలో 'హలో లోకేశ్'లో భాగంగా ఆయన విద్యార్థులతో ముచ్చటించారు. గ్రాడ్యుయేషన్ తర్వాత కూడా యువత ఉద్యోగాలు పొందేందుకు ఇబ్బందులు పడుతోందని.. ఇందుకు విద్యతో పరిశ్రమలను అనుసంధానించాలని అభిప్రాయపడ్డారు. ఐదేళ్లలో అన్ని రంగాల్లో కలిపి 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. రాజమండ్రిలో ఆదికవి నన్నయ్య యూనివర్సిటీని సందర్శించిన లోకేష్.. యూనివర్సిటీలో రూ.34కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించిన మూడు భవనాలను ప్రారంభించారు. మంజీరా బ్లాక్ పేరుతో నూతనంగా నిర్మించిన ఎగ్జామినేషన్ బిల్డింగ్, గౌతమి బ్లాక్ పేరుతో నిర్మించిన కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్, ఇంద్రావతి బ్లాక్ పేరుతో నిర్మించిన స్కూల్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ స్టడీస్ భవనాలను ప్రారంభించి... విద్యార్థులతో మాట్లాడి వారి ఆలోచనలు తెలుసుకున్నారు.

## ఏపీలో గోదావరి పుష్కరాలు.. ప్రభుత్వం కీలక నిర్ణయం

గోదావరి పుష్కరాల పై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2027 జూన్ 26 నుండి జూలై 7 వరకు గోదావరి పుష్కరాలు నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఇప్పటి నుంచే కట్టుదిట్టమైన ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. జిల్లాల వారీగా స్నాన ఘట్టాలను ఏర్పాటు చేస్తోంది. ఆయా శాఖల వారీగా చేపట్టాల్సిన ఏర్పాట్లపైనా మైక్రో ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2015లో జరిగిన పుష్కరాల కంటే 2027 పుష్కరాలను రెట్టింపు స్థాయిలో నిర్వహించాలని, భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. ఇందుకు తగిన స్థాయిలో భద్రత, వసతి ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు అధికారలతో సచివాలయంలో సిఎస్ విజయానంద్ సమీక్ష నిర్వహించారు. గోదావరి పుష్కరాలతో పాటు పలు కీలక అంశాలపై చర్చించారు. గోదావరి పుష్కరాల తేదీలను ప్రకటించారు.

# ఏటా కొత్త పిక్సెల్ ఫోన్.. కొత్త అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ తీసుకొచ్చిన గూగుల్



పిక్సెల్ ఫోన్ లవర్స్‌కి గుడ్‌న్యూస్. ప్రముఖ టెక్ సంస్థ గూగుల్ పిక్సెల్ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను భారత్‌కు తీసుకొచ్చింది. దీనిద్వారా ఏటా కొత్త పిక్సెల్ ఫోన్‌కు మారొచ్చు. లేటెస్ట్ గూగుల్ పిక్సెల్ స్మార్ట్‌ఫోన్ కొనుగోలును ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ సులభతరం చేస్తుందని కంపెనీ తెలిపింది. మెరుగైన ఫైనాన్సింగ్ సౌకర్యం కూడా కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌లో పాల్గొనాలంటే పిక్సెల్ స్మార్ట్‌ఫోన్‌ను కొనుగోలు చేయాల్సిఉంటుంది. 24 నెలల నో కాస్ట్ ఈఎంఐ ప్లాన్‌ను ఎంచుకోవచ్చు. నెలకు రూ.3,333 నుంచి ఈ ప్లాన్లు ప్రారంభమవుతాయి. ఈ పిక్సెల్ ఫోన్‌కు చెల్లింపులు చేసుకుంటూ వెళ్లాక 9వ నెల నుంచి 15వ నెల మధ్య కొత్త ఫోన్ అప్‌గ్రేడ్‌కు అర్హత లభిస్తుంది. వద్దనుకుంటే 24 నెలల ఈఎంఐ చెల్లింపులను పూర్తి చేసి ఫోన్ సొంతం చేసుకోవచ్చు. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం నాలుగు దశలు ఉంటాయి. తొలుత పిక్సెల్ 10 సిరీస్‌లో ఒక డివైజ్‌ను నో కాస్ట్ ఈఎంఐ కింద కొనుగోలు చేయాలి. 9-15 నెలల మధ్య కొత్త ఫోన్‌కు అప్‌గ్రేడ్ అవడానికి అర్హత లభిస్తుంది. అప్పుడు గూగుల్ భాగస్వామి అయిన క్యాషిఫైకి.. మీ పాత ఫోన్‌ను విక్రయించాలి. మీ పాత ఫోన్‌కు విలువ కట్టి ఆ మొత్తాన్ని బ్యాంకు ఖాతాలో జమ చేస్తుంది. ఆ మొత్తంతో మీ పాత ఫోన్ బకాయిని క్లియర్ చేయొచ్చు. ఈ ప్రోగ్రామ్ కింద ఎన్‌రోల్ చేసుకున్న వారికి ఎక్స్ఛేంజ్ బోనస్ కింద రూ.7వేలు లభిస్తుందని, దీంతో పాటు అష్యూర్డ్ బై బ్యాంక్ గ్యారెంటీ కూడా లభిస్తుందని తెలిపింది. బజాజ్ ఫైనాన్స్, క్యాషిఫై, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ భాగస్వామ్యంతో ఈ అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్‌ను గూగుల్ అందిస్తోంది. 2026 జూన్ 30 వరకు అప్‌గ్రేడ్ ప్రోగ్రామ్ అందుబాటులో ఉంటుందని కంపెనీ తెలిపింది.




# ఆసుపత్రి కోసం ఆస్తి ధారపోసిన టెన్నిస్ స్టార్.. ఈ వార్తలో నిజమెంత?




టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ ఒక ఆసుపత్రి నిర్మాణం కోసం తన యావదాస్తిని ధారపోశారని, నిరాశ్రయులు, ఎలాంటి బీమా సదుపాయం లేని వారికి ఉచితంగా వైద్య సాయం అందించేలా 1200 పడకలతో అమెరికాలోని లాస్‌ఏంజెలెస్‌లో దాన్ని ఏర్పాటు చేస్తున్నారని సామాజిక మాధ్యమాల్లో ఓ పోస్ట్ వైరల్ అవుతోంది. అందుకోసం తన 500 మిలియన్ డాలర్ల సంపదను ఖర్చు చేశారనేది దాని సారాంశం. రెండోసారి గర్భవతిగా ఉన్న ఆమె.. 114 రోజులుగా టెంట్‌లోనే ఉంటూ ఆసుపత్రి పనులు పరిశీలిస్తున్నారని నిర్మాణ రంగ సిబ్బంది వెల్లడించినట్లు, ఎంఆర్ఐ మెషిన్లను కొనుగోలు చేసేందుకు ఫ్లోరిడాలో తనకున్న పెద్ద భవంతిని కూడా అమ్మేసినట్లు రాసేశారు. సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ఈ ప్రచారంలో నిజం లేదని తెలుస్తోంది. వైరల్ అవుతున్న సోషల్‌మీడియా పోస్టులో వాడిన ఫొటోలో ఆమె ఆసుపత్రిని ప్రారంభించినట్లుగా ఉంది. కానీ నిర్మాణ సిబ్బంది మాత్రం ఆమె టెంట్‌లో ఉండి పనులు పరిశీలిస్తున్నట్టుగా చెప్పారు. ఇక, ఆమె 2023లోనే రెండో బిడ్డకు జన్మనిచ్చారు. కానీ వార్తలో మాత్రం రెండోసారి గర్భవతిగా ఉన్న ఆమె నిర్మాణ పనుల్లో భాగమైనట్లు పేర్కొన్నారు. అంతర్జాతీయ మీడియా కథనాలను బట్టి సెరెనా, ఆమె భర్త అలెక్సిస్ ఒహానియన్ సంపద సుమారు 430 మిలియన్ డాలర్లుగా ఉంది. కానీ జరుగుతున్న ప్రచారంలో ఒక్క సెరెనా సంపదే 500 మిలియన్ డాలర్లుగా పేర్కొన్నారు. దీన్ని బట్టి ఇది పూర్తిగా ప్రచారం కోసం సృష్టించిన ఓ ఫేక్ పోస్ట్ అని అర్థమవుతోంది.




# శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్ బ్యాంక్‌కు 20% వాటా




దిల్లీ: ఆర్థిక సేవల రంగంలో మరో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి తరలివస్తోంది. ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ శ్రీరామ్ ఫైనాన్స్‌లో జపాన్‌కు చెందిన ఎంయూఎఫ్‌జీ బ్యాంక్ రూ.39,168 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. ఈ మేరకు 20 శాతం వాటా ఆ కంపెనీకి విక్రయించేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఒప్పందంలో భాగంగా ప్రిఫరెన్షియల్ ఈక్విటీ షేర్లను శ్రీరామ్ ఫైనాన్స్ జారీ చేయనుంది. దీంతో ఎంయూఎఫ్‌జీ బ్యాంక్‌కు 20 శాతం వాటా లభిస్తుందని శ్రీరామ్ ఫైనాన్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. భారతదేశ రుణ, ఆర్థిక సేవల భవిష్యత్ వృద్ధి సామర్థ్యంపై నమ్మకాన్ని ఈ డీల్ తెలియజేస్తోందని శ్రీరామ్ ఫైనాన్స్ ఓ ప్రకటనలో పేర్కొంది. శ్రీరామ్ ఫైనాన్స్ క్యాపిటల్ బేస్‌ను బలోపేతం చేయడంతో పాటు, వృద్ధిని వేగవంతం చేయడానికి ఈ డీల్ దోహదం చేస్తుందని తెలిపింది. వాటాదారులు, నియంత్రణ సంస్థలు ఆమోదం తెలపాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ భాగస్వామ్యం వల్ల టెక్నాలజీ, ఇన్నోవేషన్, కస్టమర్ ఎంగేజ్‌మెంట్ విషయంలో సుస్థిర వృద్ధి సాధ్యమవుతుందని తెలిపింది. ఇటీవల కాలంలో దేశీయ ప్రైవేటు బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లోకి పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులు తరలివస్తున్నాయి. పలు సంస్థలు ఇప్పటికే పెట్టుబడులు పెట్టగా.. మరికొన్ని ఒప్పందాలు చేసుకున్నాయి. జపాన్‌కు చెందిన ఎస్ఎంబీసీ యెస్ బ్యాంకులో 24 శాతం; ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకులో వార్‌బర్గ్ పింకస్, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ వాటా దక్కించుకున్నాయి. ఆర్‌బీఎల్ బ్యాంక్‌లో మెజారిటీ వాటా కొనుగోలుకు ఎమిరేట్స్ ఎన్‌బీడీ ముందుకురాగా.. ఫెడరల్ బ్యాంకులో న్యూయార్క్‌కు చెందిన బ్లాక్‌స్టోన్ కంపెనీ 9.99 శాతం వాటా కొనుగోలుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఈ నేపథ్యంలో శ్రీరామ్ ఫైనాన్స్‌లోనూ ఎంయూఎఫ్‌జీ రూపంలో అతిపెద్ద ఎఫ్‌డీఐ తరలిరావడం విశేషం.

# మనల్ని మనమే ఛాలెంజ్ చేసుకోవాలి

: **వరుణ్ చక్రవర్తి**



రానున్న టీ20 వరల్డ్‌కప్ 2026 కోసం తన ఆత్మవిశ్వాసాన్ని కాపాడుకుంటూ.. మ్యాచుల్లో తనను తానే ఛాలెంజ్ చేసుకుంటూ సన్నద్ధమవుతున్నట్లు టీమ్‌ఇండియా మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి వివరించాడు. ఇప్పటివరకు 32 టీ20ల్లో అతడు 51 వికెట్లు పడగొట్టాడు. అలాగే టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య జరుగుతున్న టీ20 సిరీస్‌లో 6 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ప్రస్తుతం అతడు ఐసీసీ ర్యాంకింగ్స్‌లో వరల్డ్ నం.1 బౌలర్‌గా కొనసాగుతున్న విషయం తెలిసిందే. 'సవాళ్లేమీ లేనప్పుడు మనల్ని మనమే ఛాలెంజ్ చేసుకోవాలి. ఏదైనా ఒక మ్యాచ్ తేలిగ్గా ఉన్నప్పటికీ దాన్ని కూడా ఛాలెంజింగ్‌గా తీసుకోవాలి. ఆత్మవిశ్వాసంతో రైట్ లెన్త్‌ల్లో బౌలింగ్ వేయాలి. అలాగే ప్రత్యర్థులను అర్థం చేసుకోవడం కీలకం. వరల్డ్ కప్‌లో ఇదే ప్రధానాంశం. నేను ఈ విషయంలో రాణిస్తాననే అనుకుంటున్నా' అని వరుణ్ చక్రవర్తి వివరించాడు. 'నా ప్రణాళిక చాలా తేలికగా ఉంటుంది. నా లెన్త్‌లో నేను బౌలింగ్ చేస్తా. కొన్నిసార్లు అది పనిచేస్తుంది. ముఖ్యంగా గత మూడు నెలల నుంచి అది బాగా వర్కౌట్ అవుతోంది. తర్వాతి మ్యాచ్‌లోనూ నేను ఇలాగే ప్రయత్నిస్తా. మనం ఎప్పుడైతే ఆత్మవిశ్వాసంతో ఉండమో.. అప్పుడు మన మైండ్‌సెట్ మన నైపుణ్యాన్ని దెబ్బతీస్తుంది. అందుకే నిత్యం ఆత్మవిశ్వాసంతో ఉండటం కీలకం. అప్పుడే మనం అద్భుత ప్రదర్శనలు చేయగలం. నిలకడగా రాణించడంలో ఇదే అసలు రహస్యం' అని వరుణ్ చక్రవర్తి అన్నాడు. అలాగే తన మొదటి అంతర్జాతీయ మ్యాచ్ గురించి కూడా అతడు మాట్లాడాడు. 'నేను నా తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడినప్పుడు కాస్త ఇబ్బందికి గురయ్యా. తర్వాత నేను అర్థం చేసుకున్నా. ప్రాక్టీస్ చేసి నా బౌలింగ్‌లో కొన్ని మార్పులు చేసుకున్నా. ఇది చాలా కీలకం' అని వరుణ్ చక్రవర్తి అన్నాడు.

# భారత్‌కు భారీగా 'చైనా సరకు'.. వాణిజ్యలోటు 100 బిలియన్ డాలర్ల పైనే..!





దిల్లీ: భారత్‌చైనా మధ్య వాణిజ్య అంతరం నానాటికీ పెరుగుతోంది. ఓవైపు బీజింగ్ నుంచి మన దేశానికి దిగుమతులు భారీగా ఉంటుండగా.. భారత్ నుంచి చైనాకు ఎగుమతులు మాత్రం చాలా తక్కువస్థాయిలో ఉన్నాయి. దీంతో ఈ ఏడాది చైనాతో మన వాణిజ్యలోటు 106 బిలియన్ డాలర్ల వరకు ఉండొచ్చని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) అంచనా వేసింది. చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్, మెషినరీ, ఆర్గానిక్ కెమికల్స్, ప్లాస్టిక్ సంబంధ దిగుమతులు పెరుగుతున్నట్లు తెలిపింది.

* **జీటీఆర్ఐ నివేదికలో కీలక అంశాలివే..**

2021లో భారత్‌లోకి చైనా దిగుమతుల విలువ 87.7 బిలియన్ డాలర్లు ఉండగా.. గతేడాది 109.6 బిలియన్ డాలర్లకు పెరిగింది. 2025లో ఆ దిగుమతుల విలువ ఏకంగా 123.5 బిలియన్ డాలర్లు ఉండొచ్చని అంచనా. ఇక, 2021లో చైనాకు మన దేశం నుంచి ఎగుమతి చేసిన వస్తువుల విలువ 23 బిలియన్ డాలర్లు ఉండగా.. గతేడాది నాటికి ఆ మొత్తం 15.1 బిలియన్ డాలర్లకు పడిపోయింది. 2025లో ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగి 17.5 బిలియన్ డాలర్లకు చేరొచ్చని జీటీఆర్ఐ అంచనా వేసింది. అయితే, గతంతో పోలిస్తే ఈ విలువ చాలా తక్కువే. ఎగుమతులు తగ్గుతుండటంతో చైనాతో భారత్‌కు వాణిజ్య లోటు భారీగా ఉంటోంది. 2021లో భారత వాణిజ్య అంతరం 64.7 బిలియన్ డాలర్లుగా ఉండగా.. గతేడాది 94.5 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఈ ఏడాది వాణిజ్య లోటు 106 బిలియన్ డాలర్లకు చేరుతుందని అంచనా. ఈ ఏడాది జనవరిఅక్టోబరు మధ్య చైనా నుంచి అత్యధికంగా ఎలక్ట్రానిక్స్ సంబంధిత పరికరాలు, ఉపకరణాలు దిగుమతి అయ్యాయి. వీటి విలువ 38 బిలియన్ డాలర్ల పైనే ఉంది. ఇందులో మొబైల్ ఫోన్ కాంపోనెంట్స్ (8.6 బిలియన్ డాలర్లు), ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్స్ (6.2 బిలియన్ డాలర్లు), ల్యాప్‌టాప్‌లు (4.5 బిలియన్ డాలర్లు), సోలార్ సెల్స్, లిథియం అయాన్ బ్యాటరీలు వంటివి ఉన్నాయి. ఇక, నవంబరులో చైనాకు 2.2 బిలియన్ డాలర్ల వస్తువులు మన దేశం నుంచి ఎగుమతి అయ్యాయి. ఏప్రిల్‌నవంబరు మధ్య మొత్తం ఎగుమతుల విలువ 12.2 బిలియన్ డాలర్లుగా ఉంది. ప్లాస్టిక్ పరిశ్రమలో ఉపయోగించే నాఫ్తాను ఎక్కువగా ఎగుమతి చేయడంతో.. ఈ ఏడాది పొరుగు దేశానికి మన ఎగుమతుల విలువ స్వల్పంగా పెరిగిందని జీటీఆర్ఐ తెలిపింది.

# బుమ్రా విషయంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం: రాబిన్ ఉతప్ప




బౌలింగ్‌లో వినూత్నమైన యాక్షన్, వేగం వల్ల జస్‌ప్రీత్ బుమ్రా శరీరం అధిక ఒత్తిడికి గురవుతోందని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ రాబిన్ ఉతప్ప అభిప్రాయపడ్డాడు. ఈ నేపథ్యంలో బుమ్రా విషయంలో వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకమని అతడు సూచించాడు. దక్షిణాఫ్రికాతో టెస్ట్ సిరీస్ ఆడిన బుమ్రాకు వన్డే సిరీస్‌లో విశ్రాంతి ఇచ్చారు. ప్రస్తుతం టీ20 సిరీస్‌లో ఆడుతున్నాడు. వ్యక్తిగత కారణాల వల్ల మూడో టీ20కి బుమ్రా దూరమయ్యాడు. లఖ్‌నవూలో జరగాల్సిన నాలుగో టీ20 పొగమంచు కారణంగా రద్దైన విషయం తెలిసిందే. అయితే కటక్‌లో జరిగిన తొలి టీ20లో టీమ్‌ఇండియా 101 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. ఈ గెలుపులో బుమ్రా కీలక పాత్ర పోషించాడు. 'బుమ్రా ఒక అద్భుతమైన మ్యాచ్ విన్నర్. అతడి వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌ను సరిగ్గా నిర్వహించడం చాలా అవసరం. క్రికెట్‌లో ఫాస్ట్ బౌలింగ్ అనేది సవాళ్లతో కూడుకున్నది. పైగా బౌలింగ్‌లో బుమ్రాది వినూత్న యాక్షన్. అలాగే బంతి వేగమూ ఎక్కువగా ఉంటుంది' అని రాబిన్ ఉతప్ప విశ్లేషించాడు. 'బుమ్రాను జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఆ సమయంలో అతడు తగినంత క్రికెట్ ఆడేలా చూడాలి. ఆటలో మనం అతడి ప్రతిభను చూశాం. రానున్న టీ20 వరల్డ్‌కప్ నేపథ్యంలో అతడు మరింత నిలకడగా రాణిస్తాడని ఆశిస్తున్నా. దక్షిణాఫ్రికా మంచి పోటీ ఇస్తోంది. కానీ ఈ టీ20 సిరీస్‌లో వారు ఆశించిన మేర రాణించలేదు. వారి బౌలింగ్ అద్భుతంగా ఉంది. అయితే వారి బ్యాటింగ్‌లోనే నిలకడ లోపించింది' అని ఉతప్ప పేర్కొన్నాడు. అలాగే మరికొన్ని గంటల్లో అహ్మదాబాద్ వేదికగా జరగనున్న అయిదో టీ20 గురించి కూడా రాబిన్ ఉతప్ప మాట్లాడాడు. 'అహ్మదాబాద్‌లో పోరు రసవత్తరంగా సాగనుంది. ఎందుకంటే సౌతాఫ్రికా ఈ మ్యాచ్‌లో గెలిచి సిరీస్‌ను సమం చేయాలని చూస్తోంది. వారు ఈ టూర్‌లో బాగా ఆడుతున్నారు. ముఖ్యంగా టెస్ట్ సిరీస్‌ను 20తో కైవసం చేసుకున్నారు. వైట్‌బాల్ క్రికెట్‌లోనూ పోటీ ఇస్తున్నారు. అయితే టీమ్‌ఇండియా మంచి కమ్‌బ్యాక్ ఇచ్చింది. దక్షిణాఫ్రికా మాత్రం విజయంతో టీ20 సిరీస్‌ను ముగించాలని చూస్తోంది' అని రాబిన్ ఉతప్ప అన్నాడు.

MOVIE TIME

# హైదరాబాద్‌లో రకుల్ ప్రీత్..

రీఎంట్రీపై ఆసక్తికర వ్యాఖ్యలు

తెలుగు సినిమాలను మిస్ అవుతున్నానన్న రకుల్

మంచి కథ దొరికితే తప్పకుండా టాలీవుడ్‌లో నటిస్తానని వెల్లడి

బాహుబలి లాంటి సినిమా చేయడం తన డ్రీమ్ రోల్ అని వ్యాఖ్య

టాకీస్: టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వెలిగిన రకుల్ ప్రీత్ సింగ్, తాను మళ్లీ తెలుగు సినిమాల్లో నటించేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. మంచి కథ కోసం ఎదురుచూస్తున్నానని, 'బాహుబలి' వంటి గొప్ప చిత్రంలో నటించడం తన కల అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లోని పంజాగుట్టలో ప్రముఖ మేకప్ ఆర్టిస్ట్ కడాలి చక్రవర్తి (చక్రి) కొత్తగా ఏర్పాటు చేసిన "సెకండ్ స్కిన్ మేకప్ స్టూడియో అకాడమీ"ని రకుల్ ప్రీత్ సింగ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, తెలుగు చిత్ర పరిశ్రమతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. "నాకు తొలి విజయాన్ని అందించింది తెలుగు సినిమానే. ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతో ఆదరించారు. ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాలు చేయకపోవడంతో అందరినీ చాలా మిస్ అవుతున్నాను. మంచి కథ దొరికితే తప్పకుండా నటిస్తాను. నా అభిమానులంతా నా కోసం ప్రార్థించండి" అని రకుల్ కోరారు. హైదరాబాద్‌లో ఉండి షూటింగ్ చేయాలనే కోరిక బలంగా ఉందని, ప్రస్తుతం కొన్ని కథలు వింటున్నానని ఆమె వెల్లడించారు. 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన రకుల్, అతి తక్కువ కాలంలోనే ఎన్టీఆర్, మహేశ్ బాబు, రామ్ చరణ్ వంటి అగ్ర హీరోలతో కలిసి నటించి స్టార్‌డమ్ సంపాదించారు. ప్రస్తుతం బాలీవుడ్ చిత్రాలపై దృష్టి సారించిన ఆమె, నిర్మాత జాకీ భగ్నానీని వివాహం చేసుకున్న విషయం తెలిసిందే.




# సనాతన ధర్మం కాపాడుకోవడం అందరి బాధ్యత

కాశీ విశ్వేరుడిని దర్శించుకున్న బాలయ్య, బోయపాటి




టాకీస్: వారణాసిలోని కాశీ విశ్వనాథ స్వామిని అఖండ-2 బృందం దర్శించుకుంది. నటుడు నందమూరి బాలకృష్ణ దర్శకుడు బోయపాటి కలసి కాశీని సందర్శించారు. అఖండ 2' చిత్రానికి వస్తున్న అపూర్వ స్పందన నేపథ్యంలో చిత్రయూనిట్‌తో కలిసి బాలయ్య ఆధ్యాత్మిక నగరమైన కాశీకి వెళ్లి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ.. నేటి తరం సనాతన ధర్మం గొప్పతనాన్ని తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన ధర్మాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. 'అఖండ 2' సినిమాలో తాను సనాతన సైనికుడిగా నటించానని, ఆ పాత్ర తనకు ఎంతో ఆత్మసంతృప్తిని ఇచ్చిందని బాలకృష్ణ వెల్లడించారు. ఈ సినిమాకు అన్ని వర్గాల ప్రేక్షకుల నుంచి అనూహ్యమైన స్పందన వస్తోందని తెలిపారు. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌ను నిర్మాతలు, దర్శకుడు కలిసి కలసి సినిమా గురించి వివరించారని బాలయ్య పేర్కొన్నారు. సినిమా సందేశం, సనాతన ధర్మంపై ఉన్న అంశాలు ఆయనను ఆకట్టుకున్నాయని చెప్పారు. బోయపాటి శ్రీను దర్శకత్వంలో తెరకెక్కిన 'అఖండ 2' భారీ అంచనాల మధ్య డిసెంబర్ 12న థియేటర్లలోకి వచ్చింది. విడుదలైన తొలి రోజునుంచే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. బాలకృష్ణ అఘోరగా కనిపించిన లుక్, పవర్‌ఫుల్ డైలాగ్స్, మాస్ ఎలివేషన్లు అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఫస్ట్ వీక్‌లోనే గట్టి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ఇప్పుడు కలెక్షన్ల సునామీ సృష్టిస్తూ విజయవంతంగా రన్ అవుతోంది. ఈ సినిమాను 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట కలిసి నిర్మించారు. ఎస్.ఎస్. థమన్ అందించిన సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. సంయుక్త మీనన్, హర్షాలీ మల్హోత్ర కీలక పాత్రల్లో నటించి కథకు మరింత బలం చేకూర్చారు. 'అఖండ 2' విజయం నేపథ్యంలో కాశీలో స్వామివారి దర్శనం చేసుకోవడం ఆనందంగా ఉందని, ఈ సినిమా తన కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందని బాలకృష్ణ తెలిపారు. ఇది కేవలం తెలుగు సినిమా కాదని, భారతీయులందరి చిత్రమని పేర్కొన్నారు. మంచి సినిమా కోసం చేసిన ప్రయత్నం ఫలించిందన్నారు. చిత్రాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పటికే హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించిన టీమ్ ఇప్పుడు ఉత్తరాదిలో సినిమాని ప్రమోట్ చేస్తోంది.

# ధురంధర్ కలెక్షన్ల వర్షం

నెట్‌ఫ్లిక్స్‌లో భారీ ఆఫర్

**టాకీస్:** బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ ప్రధాన పాత్రలో, 'ఉరి' ఫేమ్ ఆదిత్య ధార్ దర్శకత్వంలో రూపొందిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్' ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఒకవైపు థియేటర్‌లలో ఈ చిత్రం దూసుకుపోతుండగా.. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులకు సంబంధించి ఒక భారీ డీల్ కుదిరినట్లు వార్తలు వస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా కోసం ఏకంగా రూ. 285 కోట్లు చెల్లించినట్లు టాక్ నడుస్తోంది. ఇది 'పుష్ప 2' ఓటీటీ డీల్ కంటే



ఎక్కువ అని ఇండస్ట్రీ వర్గాల సమాచారం. థియేటర్లలో విడుదలైన 8 వారాల తర్వాత, అంటే 2026 జనవరి 30న లేదా ఫిబ్రవరి మొదటి వారంలో ఈ సినిమా నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల అయ్యే అవకాశం ఉంది. ఈ సినిమాకు సీక్వెల్ కూడా ఉండటంతో, ఈ డీల్ రెండు భాగాలకు కలిపి జరిగిందా లేక మొదటి భాగానికే ఇంత భారీ మొత్తం ఇచ్చారా అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. డిసెంబర్ 5న విడుదలైన ఈ చిత్రం ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించింది. ఫుల్ రన్ ముగిసే సమయానికి రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరుతుందని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రణవీర్ సింగ్, ఆర్. మాధవన్, సంజయ్ దత్, అక్షయ్ ఖన్నా, అర్జున్ రాంపాల్ తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటించారు. 'ధురంధర్: రివెంజ్' పేరుతో పార్ట్ 2 వచ్చే ఏడాది మార్చి 19, 2026న విడుదల కానుంది.

# ఓ మంచి సినిమా ప్రయత్నంలో ఉన్నాం

డెకాయిట్‌పై అడివి శేష్ కామెంట్




టాకీస్: ఆలస్యమైనా ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలన్నదే నా తపన. అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందుతున్న 'డెకాయిట్' విషయంలో మేమంతా గర్వపడుతున్నాం అని అడివి శేష్ అన్నారు. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందుతున్న సినిమానే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్ర పోషించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. ఈ చిత్రం వచ్చే ఏడాది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కథానాయకుడు అడివి శేష్ మాట్లాడుతూ ఎక్కడికి పోయాడు? ఏం చేస్తున్నాడు? అంటూ నా గురించి ఎక్స్‌లో చర్చ జరుగుతోంది. నేను ఎక్కడికీ పోలేదు. ఈ సినిమానే చేస్తున్నా. ఇలా చాలా పెద్ద సినిమా. తెలుగు, హిందీ భాషల్లో చేశాం. నేను, షానియల్ కలిసి రాశాం. అనురాగ్ కశ్యప్ మాకు మార్గనిర్దేశనర చేశారు. మృణాల్ అద్భుతమైన నటనని ఇందులో చూస్తారు. ఈ సినిమా అంతర్జాతీయ ప్రమాణాలతో రూపొందడానికి కారణం నిర్మాత సుప్రియ. సునీల్, జాన్వి ఈ సినిమాని మరింత ముందుకు తీసుకెళుతున్నారు. ప్రేక్షకుల మనసుల్లో ఎప్పటికీ గుర్తుండిపోయే పాత్రల్లో నటించడమే నా లక్ష్యం అని అన్నారు. మృణాల్ ఠాకూర్ మాట్లాడుతూ నా మనసుకు దగ్గరైన సినిమా ఇది. హృదయం పెట్టి పనిచేశా. 'సీతారామం' సినిమాని స్వప్నతో, ఇప్పుడు సుప్రియ... మహిళా నిర్మాతలతో కలిసి సినిమా చేయడం చాలా బాగుంది. శేష్ పాత్ర చాలా బాగుంటుంది. ఈ సినిమాకోసం ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నా' అన్నారు.

# మెగా ఫ్యాన్స్‌తో అనిల్ రావిపూడి మీట్ అండ్ గ్రీట్



టాకీస్: అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో మెగాస్టార్ చిరంజీవి హీరోగా తెరకెక్కుతున్న సినిమా మన శంకర వరప్రసాద్ గారు. నయనతార హీరోయిన్ గా నటిస్తోంది. సంక్రాంతికి వస్తున్నాం తర్వాత అనిల్ రావిపూడి నుండి వస్తున్నా ఈ సినిమాపై ఇప్పటి నుండే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాను భారీ చిత్రాల నిర్మాణ సంస్థ ÷న్ స్క్రీన్స్ బ్యానర్ పై సాహు గారపాటి మరియు గోల్డ్ బాక్స్ ఎంట్లంల్గ÷న్మెంట్స్ పై సాహు గారపాటి, సుష్మిత కొణిదెల సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వచ్చే ఏడాది సంక్రాంతి కనుకాగా జనవరి 12న వరల్డ్ వైడ్ గా రిలీజ్ కాబోతుంది మన శంకర వరప్రసాద్ గారు.ఈ నేపథ్యంలో మెగాస్టార్ అభిమానులతో మిాట్ అండ్ గ్రీట్ నిర్వహించారు దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి. ఫ్యాన్స్ కి గిఫ్ట్ హ్యాంపర్లు తో పాటు నూతన సంవత్సర క్యాలండర్స్, మనశంకర వరప్రసాద్ టీ షర్ట్స్..పెన్ తో పాటు స్వీట్స్ మరికొన్ని మరికొన్ని బహుమతులు అందజేశారు. సినిమాకు సంబందించిన ముచ్చట్లతో పాటు ఇతర విశేషాలను కూడా ఫ్యాన్స్ తో పంచుకున్నారు మేకర్స్. అలాగే మెగాస్టార్ చిరు నుండి వింటేజ్ కామెడీ సినిమా వచ్చి చాలా కాలం అయింది ఇప్పుడు అలంటి సినిమాను ఇస్తున్నందుకు దర్శకుడు అనిల్ రావిపూడికి అభినందనలు తెలిపారు. వింటేజ్ స్టైల్ చిరు కామెడీ టైమింగ్ కు అనిల్ రావిపూడి మేకింగ్ కలగలిపి మన శంకర వరప్రసాద్ గారు సూపర్ హిట్ అవుతుందని ఫ్యాన్స్ ఈ సినిమా కోసం ఈగర్ గా వెయిట్ చేస్తున్నారు.

# 'ఇక్కీస్' ట్రైలర్ విడుదల




టాకీస్: బాలీవుడ్ లెజెండ్ ధర్మేంద్ర ఆఖరి చిత్రం 'ఇక్కీస్' ట్రైలర్ తాజాగా విడుదలైంది. చిన్న వయసులోనే దేశ అత్యున్నత సైనిక పురస్కారం పరమవీర చక్రను అందుకున్న వీరుడు, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ జీవిత చరిత్ర ఆధారంగా రూపొందుతున్న చిత్రం 'ఇక్కీస్'. ఈ బయోపిక్‌లో అరుణ్ ఖేతర్‌పాల్ పాత్రలో బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద నటిస్తుండగా.. దివంగత నటుడు ధర్మేంద్ర, పాతల్ లోక్ నటుడు జైదీప్ అహ్లావత్ ముఖ్య పాత్రల్లో కనిపించనున్నారు. 'అంధాధున్' ఫేం దర్శకుడు శ్రీరామ్ రాఘవన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం మొదట డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా.. అవతార్, ధురంధర్ చిత్రాల వలన వాయిదా పడింది. అయితే ఇప్పుడు ఇదే సినిమాను జనవరి 01 న ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు మేకర్స్. ఈ సందర్భంగా మూవీ నుంచి కొత్త ట్రైలర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధం నాటి వాస్తవ సంఘటనలను కళ్లకు కట్టినట్లు చూపించనుంది. కేవలం 21 ఏళ్ల వయసులోనే అద్భుతమైన ధైర్యసాహసాలు ప్రదర్శించి దేశం కోసం వీర మరణం పొందిన అరుణ్ ఖేతర్‌పాల్ త్యాగాన్ని ఈ సినిమా గుర్తు చేస్తుంది. ఆ వీరత్వం, పోరాట పటిమ కారణంగానే ఆయనకు మరణానంతరం పరమవీర చక్ర పురస్కారం లభించింది. ఈ చిత్రంలో ధర్మేంద్ర.. అరుణ్ ఖేతర్‌పాల్ తండ్రి అయిన బ్రిగేడియర్ ఎం.ఎల్. ఖేతర్‌పాల్ పాత్రలో నటించారు. దేశం కోసం కొడుకు ప్రాణాలర్పించినా, ఒక సైనికుడిగా గర్వపడే తండ్రి పాత్రలో ధర్మేంద్ర నటన హైలైట్‌గా నిలవనుంది. ట్రైలర్‌లో ఆయన డైలాగ్ డెలివరీ మరియు భావోద్వేగాలు కంటతడి పెట్టిస్తున్నాయి.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.